



# విజయభాను






విశాఖపట్నం, బుధవారం 26-08-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 301 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై వీడియో కాన్ఫరెన్స్



విశాఖపట్నం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం నాడు తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ లతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన కోవిడ్-19 నివారణ, చికిత్స , ఆరోగ్య శ్రీ, ఇళ్ళ పట్టాల పంపిణీ, ఉపాధి హామీ పథకం అమలు, నాడు నేడు కార్యక్రమంలో పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన, జగనన్న విద్యా కానుక, వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో మహిళలకు శిక్షణ, జీవనోపాధి, వ్యవసాయ శాఖ లో ఈ-క్రాప్ డేటా ఎంట్రీ, రైతు భరోసా కేంద్రాల నిర్వహణ, దళితుల పై దాడులు, అట్రాసిటీ చట్టం అమలు, ఇసుక, మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు తీసుకోవలసిన చర్యల పై సమీక్ష నిర్వహించారు. విశాఖపట్నం నుంచి జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్, జాయింట్ కలెక్టర్ లు వేణుగోపాల రెడ్డి, గోవింద రావు, జివియంసీ కమీషనర్ జి.సృజన, రూరల్ ఎస్పీ కృష్ణా రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఎనిమిది స్పెషల్ కోర్టులు మంజూరు

విజయవాడ : ఆడపిల్లల రక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎనిమిది స్పెషల్ కోర్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని చిన్నపిల్లలపై జరిగే లైంగిక నేరాల కేసులు (పోక్సో) విచారణ కోసం ఈ ప్రత్యేక కోర్టులు పనిచేస్తాయని ప్రభుత్వం తన ఉత్తర్వులో పేర్కొంది. వందకు పైగా పోక్సో కేసులు పెండింగ్ లో ఉన్న చోట కోర్టులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. శ్రీకాకుళం, విజయనగరం, కర్నూలు, కడప , అనంతపురం, పశ్చిమ గోదావరి, భీమవరం, తెనాలి, మచిలీపట్నంలలో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయనుంది. జిల్లా జడ్జి క్యాడర్‌తో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు పనిచేయనున్నాయి. కాగా మహిళ రక్షణ కొరకు ఏపీ సర్కార్ ఇదివరకే దిశ చట్టాన్ని రూపొందించిన విషయం తెలిసిందే.

# ఇ-క్రాపింగ్ పూర్తి చేయండి

- పనులు వేగంగా జరగాలి
- కలెక్టర్లు, జేసీలు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఎరువులు పంపిణీ చేయండి
- వివిధ అంశాలపై సీఎం జగన్ సమీక్ష

### ఇళ్ల పట్టాల పంపిణీపై సీఎం జగన్ సమీక్ష



తాడేపల్లి: ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని త్వరలోనే చేపడతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. రూ.22వేల కోట్ల విలువైన ఆస్తులను.. 30లక్షల మంది అక్కాచెల్లెమ్మల పేరిట రిజిస్ట్రేషన్ చేయబోతున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఇళ్ల పట్టాల పంపిణీ సహా వివిధ అంశాలపై సీఎం వైఎస్ జగన్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాట్ల అభివృద్ధి, మార్కింగ్, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా టీడీపీ నాయకుల తీరు కారణంగా ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ విషయం గురించి సీఎం జగన్ మాట్లాడుతూ.. "దేశంలో ఎక్కడా ఇలాంటి కార్యక్రమం జరగలేదు. మంచి కార్యక్రమానికి శత్రువులు ఎక్కువగా ఉన్నారు. చంద్రబాబు, టీడీపీ నేతలు కేసులు వేసి అడ్డుకుంటున్నారు. ఆ సమస్యలను అధిగమించేందుకు వివిధ వేదికలపై పోరాటం చేయాల్సి వస్తోంది. కొంత సమయం పట్టినా చివరకు న్యాయమే గెలుస్తుంది" అని పేర్కొన్నారు.

**పనులు వేగంగా జరగాలి: సీఎం జగన్**

గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ నిర్మాణంపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. "ప్రతి జిల్లాలో ప్రతి వారం రూ.10 కోట్ల మెటీరియల్ కాంపొనెంట్ పనులు జరగాలి. పనులు వేగంగా జరగాలి"అని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. అదే విధంగా పాఠశాలల్లో నాడు- నేడు కార్యక్రమంపై సమీక్ష సమావేశంలో భాగంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ పాఠశాలను వైఎస్సార్ ప్రీప్రైమరీ స్కూల్స్‌గా మారుస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 55వేల అంగన్‌వాడీల్లో నాడు-నేడు కింద పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంపై కలెక్టర్లు, జేసీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సెప్టెంబర్ 5 నుంచి స్కూళ్లు తెరవాలనే ఆలోచన ఉన్నందున.. అంతకంటే ముందే వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.


**వైఎస్సార్ చేయూత, స్వయం సహాయక చర్యలపై సీఎం జగన్ సమీక్ష**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు 'వైఎస్సార్ చేయూత' ద్వారా ఆర్థిక సహాయం అందించామని.. బ్యాంకులకు ఈ డబ్బుపై ఎలాంటి హక్కు లేదని సీఎం జగన్ స్పష్టం చేశారు. ఎక్కడైనా సమస్యలు వస్తే కలెక్టర్లు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మహిళలకు స్థిరమైన జీవనోపాధి మార్గాలను చూపడానికి.. హిందూస్థాన్, యూనిలీవర్, ఐటీసీ, పీ&జి, రిలయన్స్, అమూల్.. అలానా గ్రూపులతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామన్న ముఖ్యమంత్రి.. రాష్ట్ర స్థాయిలో ప్రతి 15 రోజులకోసారి మంత్రుల బృందం రివ్యూ చేస్తుందని తెలిపారు. మహిళలు ఎంపిక చేసుకున్న జీవనోపాధి మార్గాల్లో చేయూతనివ్వాలని.. వారికి ఏం కావాలో దగ్గరుండి చూసుకోవాలని అధికారులను

తరువాయి 2లో..

## మత్స్యకారుల వలసలకు చెక్

- మత్స్యకారులను ఆదుకోవాలన్నదే లక్ష్యం
- ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్



- భావన పాడు పోర్టు డిపిఆర్ కి ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు
- రైట్స్ సంస్థ రూపొందించిన డిపిఆర్ ను ఆమోదించిన ప్రభుత్వం
- 3669.95 కోట్ల తో ఫేజ్ 1 పనులకు డిపిఆర్ ఆమోదం
- 36 నెలల్లో ఫేజ్ 1 పోర్టు పూర్తి చేయాలని నిర్ణయం
- భూ సేకరణకు 261 కోట్లు సమకూర్చనున్న ప్రభుత్వం

అమరావతి : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత మత్స్యకారుల చిరకాల స్వప్నం భావనపాడు గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణంతో సుసాధ్యం అవుతోందని ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన అమరావతి నుంచి మంగళవారం ఉదయం ఒక ప్రకటన విడుదల చేస్తూ భావనపాడు పోర్టు నిర్మాణానికి డిపీఆర్ ని ఆమోదించడంపై ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో మత్స్యకారులు ఉపాధిలేక, చేపల వేట సాగించలేక, పోర్టులున్న ఇతర రాష్ట్రాల తీర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోతున్నారని ఆ దుస్థితిని సమూలంగా మార్చడానికి తమ ప్రభుత్వం పోర్టుల నిర్మాణానికి సంకల్పించిందని చెప్పారు. పోర్టుతో పాటు జిల్లాలో మూడు ఫిషింగ్ జెట్టీల నిర్మాణం కూడా త్వరలోనే జరగనుందని అన్నారు. ఇద్దు వానిపాలెం, బుడగట్లపాలెం, మంచినీళ్లపేటలలో వాటి నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపిందన్నారు. భావనపాడు పోర్ట్ కు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి రెవెన్యూ అధికారులతో త్వరలోనే సమీక్షిస్తామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు ఆమోద యోగ్యంగా, రెవెన్యూ మంత్రిగా భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయించే గురుతర బాధ్యత తనపై ఉందని వివరించారు. తాను ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఈ పోర్టు నిర్మాణం జరుగుతుండటం ఎంతో సంతోషంగా ఉందని వివరించారు. రానున్న ముప్పై ఆరు నెలల్లో మొదటి దశ ప్రాజెక్టు పూర్తికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్దానం ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆనాడు పాదయాత్రలో హామీ ఇచ్చినట్టుగానే ఇప్పటికే రూ.600 కోట్లతో తాగునీటి పథకం, తాజాగా పోర్టు నిర్మాణానికి మొదటి అడుగు వేయడం, జెట్టిల నిర్మాణానికి అనుమతి ఇవ్వడం లాంటి పనులతో ఇక్కడ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కృష్ణదాస్ పేర్కొన్నారు.

## మరణాల రేటు భారత్‌లోనే తక్కువ..!

### వెల్లడించిన కేంద్ర ఆరోగ్యశాఖ

దిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ విజృంభిస్తోన్న సమయంలో మరణాల రేటు భారత్‌లోనే తక్కువని కేంద్ర ఆరోగ్యశాఖ మరోసారి స్పష్టం చేసింది. ప్రపంచంలో తక్కువ కరోనా మరణాలు సంభవిస్తోన్న దేశాల్లో భారత్ ఒకటని పేర్కొంది. ప్రస్తుతం దేశంలో కరోనా మరణాల రేటు 1.58శాతం ఉండగా, మరో 22.2శాతం క్రియాశీల కేసులు ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్ వెల్లడించారు. యాక్టివ్ కేసుల కన్నా కోలుకున్న వారి సంఖ్యే 3.4రెట్లు అధికంగా ఉన్నట్లు మీడియా సమావేశంలో పేర్కొన్నారు.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా కరోనా బాధితుల రికవరీ రేటు 75శాతం ఉందని తెలిపారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 3కోట్ల 68లక్షల శాంపిళ్లకు కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించామని రాజేశ్ భూషణ్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఆగస్టు తొలి వారంలో కరోనా కేసుల పాజిటివిటీ రేటు 11శాతం ఉండగా ప్రస్తుతం అది 8శాతానికి తగ్గిందని స్పష్టంచేశారు. దేశవ్యాప్తంగా కొవిడ్ నిర్ధారణ పరీక్షలు పెరుగుతున్నప్పటికీ పాజిటివిటీ రేటు తగ్గడం ఊరట కలిగించే విషయమని రాజేశ్ భూషణ్ అభిప్రాయపడ్డారు.

## జంట పేలుళ్లు జరిగి నేటికి 13 ఏళ్లు

హైదరాబాద్: గోకుల్ చాట్, లుంబినీ పార్కు బాంబు పేలుళ్లు జరిగి నేటికి 13 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కోఠిలోని గోకుల్ చాట్ వద్ద బాంబు పేలుళ్ల బాధితుడు సయ్యద్ రహీమ్ నివాళి అర్పించారు. ఈ పేలుళ్లలో గాయపడిన వారు ఇప్పటికీ కష్టాలు ఎదుర్కొంటున్నారని, తమను ఆదుకోవాలని రహీమ్ కోరారు. గోకుల్‌చాట్, లుంబినీపార్కు బాంబు పేలుళ్లకు పాల్పడిన దోషులకు వెంటనే ఉరి శిక్ష అమలు చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. పేలుళ్లు జరిగి నేటికి 13 ఏళ్లు అయిందని గుర్తు చేశారు. అవయవాలు కోల్పోయి బాధపడుతున్న వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. దోషులకు న్యాయస్థానం విధించిన ఉరిశిక్షను వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2007 ఆగస్టు 25న గోకుల్ చాట్, లుంబినీ పార్క్ వద్ద జరిగిన జంట పేలుళ్లలో 42 మంది అమాయక ప్రజలు మృతి చెందారు. దాదాపు 50 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. ఈకేసులో ఇద్దరు నిందితులకు ప్రత్యేక న్యాయస్థానం ఉరిశిక్ష విధించిన విషయం తెలిసిందే.

## ఏపీ పోలీస్ శాఖకు అవార్డుల పంట

అమరావతి : టెక్నాలజీ వినియోగంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖకు అవార్డుల పంట పండింది. జాతీయ స్థాయిలో ఏపీ పోలీస్‌శాఖ పది అవార్డులను సొంతం చేసుకుంది. ఈ ఏడాదిలో ఇప్పటికే 26 అవార్డులను దక్కించుకోగా తాజాగా వివిధ విభాగాల్లో మరో పది అవార్డులను కైవసం చేసుకుంది. దీంతో ఏడాది వ్యవధిలో రికార్డు స్థాయిలో 36 అవార్డులను గెలుచుకొని పోలీస్ శాఖ సత్తా చాటింది. టెక్నాలజీ వినియోగంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఈ అవార్డుల ప్రదానోత్సవానికి డీజీపీ గౌతమ్ సవాంగ్ వెబినార్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పోలీస్ శాఖకు ఇస్తున్న ప్రాముఖ్యతతోనే సత్ఫలితాలు వస్తున్నాయని వివరించారు.






## దేశానికే సీఎం జగన్ ఆదర్శంగా నిలిచారు

### మంత్రి కొడాలి నాని



విజయవాడ : పరిహారం విషయంలో దేశానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని మంత్రి కొడాలి నాని అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వర్ణ ప్యాలెస్ అగ్నిప్రమాద ఘటనలో రూ.50 లక్షలు, ఎల్జీ పాలిమర్స్ ఘటనలో రూ.కోటి చొప్పున పరిహారం ఇచ్చారని పేర్కొన్నారు. "చంద్రబాబు 'ఎల్జీమర్' వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన కమ్మ సంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. తనకు విరాళాలు ఇచ్చే వారికి అనుకూలంగా మాట్లాడుతున్నారు. రమేష్ ఆస్పత్రి నిబంధనలు ఉల్లంఘించింది. రమేష్‌ను రక్షించేందుకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రయత్నం జరుగుతుంది. చంద్రబాబు తన ఇంట్లోనే డాక్టర్ రమేష్‌ను పెట్టుకుని కాపలా కాస్తున్నారు. చంద్రబాబు కాపలా కాసినా రమేష్‌ను అరెస్ట్ చేస్తాం. బాధితుల పరామర్శకు వస్తే కరోనా వస్తుందని హైదరాబాద్‌లో దాక్కున్నారు. తనకు కూడా ఎక్స్‌గ్రేషియా వస్తుందని బాబు భయపడుతున్నారని" కొడాలి నాని ఎద్దేవా చేశారు. కమ్మ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేయాల్సిన అవసరం వైఎస్ జగన్‌ను లేదన్నారు. చంద్రబాబుకు వయస్సు పెరిగిన బుద్ధి రాలేదని ధ్వజమెత్తారు. చంద్రబాబు వెన్నుపోటుకు 25 ఏళ్లు అని, రానున్న రోజుల్లో టీడీపీకి 23 సీట్లు కూడా రావని మంత్రి కొడాలి నాని విమర్శించారు.

# భావనపాడు మంచి ప్రాజెక్టు

శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లాకు భావనపాడు మంచి ప్రాజెక్టు అని జిల్లా కలెక్టర్ జె నివాస్ అన్నారు. భావనపాడు ప్రాజెక్టుపై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భావనపాడు పోర్టు ప్రాజెక్టు డిపిఆర్ కి ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంతోషంగా ఉందన్నారు. రైట్స్ సంస్థ రూపొందించిన డిపిఆర్ ను ప్రభుత్వం ఆమోదించిందని అన్నారు. రూ.3669.95 కోట్లతో తొలి దశ పనులకు డిపిఆర్ ఆమోదించడం జరిగిందన్నారు. భూసేకరణ నోటిఫికేషన్ ఇప్పటికే విడుదల చేయడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. రైతులతో పలు దఫాలుగా చర్చలు జరపడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. పోర్టు ద్వారా జిల్లాకు మంచి జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. భావనపాడు నాన్ మేజర్ పోర్టును జిల్లాలో చేపట్టుటకు ప్రభుత్వం ఆమోదించడం జరిగింది. భావనపాడు పోర్టు ట్రస్టు తొలి దశ పనులను 36 నెలల్లో పూర్తి చేయుటకు చర్యలు చేపడుతున్నారు. ఈ పనులను భావనపాడు పోర్టు డెవలప్మెంటు కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిడిసిఎల్) ఆధ్వర్యంలో ఏపి మారిటైం బోర్డు పర్యవేక్షణలో చేపట్టుటకు నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగింది. తొలి దశ పనుల్లో భాగంగా మూడు సాధారణ కార్గో బెర్తు, ఒక బల్క్ కార్గో బెర్తు, ఐదు వందల ఎకరాల్లో అవసరమగు మౌళికసదుపాయాల కల్పన చేపట్టడం జరుగుతుంది. ఏపి మారిటైమ్ బోర్డు రూ.2,123 కోట్ల వరకు రుణం పొందుటకు కూడా ఉత్తర్వులలో అనుమతి ఇచ్చారు.

# రోజుకు 6 వేల కోవిడ్ పరీక్షలకు చర్యలు




శ్రీకాకుళం : జిల్లాలో రోజుకు ఆరు వేల కోవిడ్ పరీక్షలు నిర్వహించుటకు చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ జె నివాస్ తెలిపారు.

మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా కోవిడ్ పరీక్షలకు నమూనాలు తీసి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పాజిటివ్ వచ్చిన వారి ఫలితాలను 24 నుండి 36 గంటలలోగా తెలియజేస్తున్నామని ఆయన చెప్పారు. ప్రతి రోజు ఐదు వందల రాపిడ్ టెస్టులు నిర్వహించుటకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదించామని ఆయన చెప్పారు.






**పూర్ణామార్కెట్ సమీపంలో వున్నా పండా వీధి ఏరియాలో ఉన్న కాలువలన్ని మరియు యు.జి.డి మరమ్మతులకు గురై ప్రజలకు ఇబ్బంది కులుగుతుంది అని వై.ఎస్.అర్. కాంగ్రెస్ పార్టీ 35వవార్డు అధ్యక్షులు కార్పొరేటర్ అభ్యర్థి అలుపన కనకరెడ్డి ఆ యొక్క సమస్య ను చూసి అక్కడ ఉన్న స్థానిక ప్రజల ఇబ్బందులు తెలుసుకొని వెంటనే జివియంసి కి సంబంధించి ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కి తెలియజేసిన 10 నిమిషాల్లో ఆ శాఖ వారు స్పందించి వెంటనే యూజీడీ కి సంబంధించి మరమ్మతులు పనులు ప్రారంభించారు.**

# జిల్లా ఎంపిక కమిటీలో ప్రభుత్వం మార్పులు

అమరావతి : వచ్చే నెల 20 నుంచి సచివాలయ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. దీంతో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పరీక్షలను పర్యవేక్షించే జిల్లా ఎంపిక కమిటీలో ప్రభుత్వం మార్పులు చేసింది. వివిధ శాఖల ఉన్నతాధికారులను జిల్లా ఎంపిక కమిటీలో నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఎస్పీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీలో నూతనంగా బాధ్యతలు అప్పగించిన జాయింట్ కలెక్టర్లను ఉపాధ్యక్షులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. గ్రామ,వార్డు సచివాలయ జేసీలతో పాటు రైతు భరోసా, రెవెన్యూ జేసీలను కూడా జిల్లా ఎంపిక కమిటీలో నియమిస్తున్నట్లు పేర్కొంది. సంక్షేమ బాధ్యతలు చూసే మరో జేసీని కూడా ఈ కమిటీలో సభ్యుడిగా నియమించింది.

మొదటి పేజీ తరువాయి

# ఇ- క్రాపింగ్ పూర్తిచేయండి

ఆదేశించారు.

**ఎరువులు పంపిణీ చేయండి: సీఎం జగన్**

మండలాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఎరువులు పంపిణీ చేయాలని సీఎం జగన్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అదే విధంగా నూటికి నూరు శాతం ఇ-క్రాపింగ్ పూర్తి చేసి.. వ్యవసాయ యాంత్రీకరణపై కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. "రైతుల గ్రూపులను ఏర్పాటు చేసి యంత్రాలను డెలివరీ చేయాలి. మండల స్థాయిలో కూడా రైతులతో గ్రూపులను ఏర్పాటు చేయాలి. వర్షాలు బాగా పడినందున ఎరువుల డిమాండ్ పెరుగుతుంది. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులను పంపిణీ చేయాలి. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో ఒక ఎకరా భూమిని గుర్తించాలి"అని ఆదేశించారు. "మల్టీపర్పస్ ఫెసిలిటీస్‌ను ఏర్పాటు చేస్తున్నాం. అదే విధంగా గోడౌన్లు, పంట ఆరబెట్టుకోవడానికి ప్లాట్ ఫాం, ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు.. పశువుల శాఖ, కలెక్షన్ సెంటర్ కార్యకలాపాల కోసం వసతులు ఏర్పాటు చేయనున్నాం" అని తెలిపారు.

# తప్పు చేస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవు : సీఎం వైఎస్ జగన్



తాడేపల్లి: దళితులమీద దాడులు సహా రాష్ట్రంలో చోటుచేసుకున్న ఇతరత్రా ఘటనలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు గతంలో పట్టించుకునేవారు కాదన్నారు. గత ప్రభుత్వానికి, ఇప్పటికి ప్రభుత్వానికి తేడా ఉందని.. తప్పు ఎవరు చేసినా తప్పే.. చర్యలు తప్పవన్నారు. ఏదైనా పొరపాటు చేస్తే.. ఎస్సైని కూడా జైల్లో పెట్టిన ఘటన గతంలో జరగలేదన్నారు సీఎం జగన్. తప్పు చేసింది ఎస్సై అయినా సీఐ అయినా సరే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి కఠిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. వ్యవస్థలో మార్పులు రావాలనే ఈ చర్యలు అన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మన బంధువులే బాధితులైతే.. ఉపేక్షిస్తామా. ఈ ప్రశ్నలు మనకు మనం వేసుకుని నిష్పక్షపాతంగా చర్యలు తీసుకుంటున్నాం అన్నారు. ఈ సందేశాన్ని పోలీసు అధికారులు కింది స్థాయికి తీసుకెళ్లాలి అని సీఎం జగన్ కోరారు. కానిస్టేబుళ్లు, ఏఎస్సైలు, ఎస్సైలు, తదితర స్థాయిలో ఉన్నవారికి ఓరియెంటేషన్ నిర్వహించాలన్నారు సీఎం జగన్. మానవత్వంతో వ్యవహరించడంతో పాటు.. ప్రజలకున్న హక్కులేంటి.. మనం ఎంత వరకు వెళ్లాలి.. ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దాని పైన అవగాహన కలిగించాలని ఆదేశించారు. గుండుకొట్టించడం లాంటి ఘటనలు తప్పు.. అలాంటి చర్యలకు ఎవ్వరూ పాల్పడకూడదని స్పష్టం చేశారు. వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది కాబట్టి కఠినంగా వ్యవహరిస్తున్నమన్నారు సీఎం జగన్. ఎస్పీలు, ఏఎస్పీలు ఈ సందేశాన్ని దిగువస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర హోంమంత్రి దళితురాలు, డీజీపీ ఎస్టీ అని గుర్తు చేశారు. సమాజంలో దిగువున ఉన్నవారికి రక్షణగా నిలబడాల్సిన బాధ్యత పోలీసులదే అన్నారు. అక్రమ మద్యం తయారీ, ఇసుక రవాణాను అరికట్టడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు ఎవ్వరూ కూడా చట్టానికి అతీతులు కారన్నారు. ఇది మనసులో పెట్టుకుని విధులు నిర్వహించాలన్నారు. అవినీతికి ఎక్కడా కూడా ఆస్కారం ఉండకూడదని సీఎం జగన్ స్పష్టం చేశారు.

# ఒకటి నుంచి ఇంటర్ ఆన్‌లైన్ తరగతులు

## పాఠశాల నుంచి కళాశాల దాకా అంతా ఆన్‌లైన్ బోధనే

హైదరాబాద్: సెప్టెంబర్ ఒకటి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు ప్రారంభం అవుతాయని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. వీరితో పాటు, డిగ్రీ, పీజీ విద్యార్థులకు కూడా అదే రోజు నుంచి ఆన్‌లైన్ బోధన ప్రారంభం అవుతుందని ఆమె స్పష్టం చేశారు. అలాగే పాఠశాల విద్యార్థులకు కూడా డిజిటల్ బోధన ఉంటుందని తెలిపారు. దీని కోసం అధ్యాపకులు, ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. అధ్యాపకులు ఈ నెల 27 నుంచే కళాశాలలకు వెళ్ళాలని ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్ 5న రాధాకృష్ణ జయంతి కార్యక్రమం, ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం కూడా ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ మేరకు విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా వుండగా వచ్చే నెల 1 నుంచి పాఠశాల విద్యార్థులకు కూడా ఆన్‌లైన్ క్లాసులు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే.




# ఏవోబీలో మావోయిస్టు డంప్ స్వాధీనం

## ఒరిస్సా సరిహద్దుల్లో భారీగా మావోయిస్టుల డంప్ గుర్తింపు

విశాఖపట్నం : ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టు డంప్‌ను బీఎస్ఎఫ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన నిర్దిష్టమైన సమాచారం మేరకు సరిహద్దు భద్రతా బలగాలు, జిల్లా వాలంటీర్ ఫోర్స్ బలగాలు నేతృత్వంలో ఏవోబీలోని కలిమెల పోలీసుస్టేషన్ పరిధిలోని సూధికొండ సమీపంలో కురూబ్ అటవీప్రాంతంలో గాలింపు చర్యలు నిర్వహించారు. ఈ క్రమంలోనే మంగళవారం మావోయిస్టులు దాచి ఉంచిన డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ డంప్‌లో ఆయుధాలు తయారీకు ఉపయోగించే లేత్‌మిషన్, గ్యాస్ వెల్డింగ్ చేసే సిలిండెర్లు, లేత్ మిషన్ విడిబాగాలుతో బాటు ఆయుధాలు , విప్లవసాహిత్యం, ఇనుప తుక్కు సామాగ్రీ తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. మల్కన్‌గిరి జిల్లా కార్యాలయంలో విలేకర్లు ముందు స్వాధీనం చేసుకున్న సామాగ్రీను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మల్కన్‌గిరి జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ కురూబ్ అటవీప్రాంతంలో కలిమెల ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల సమావేశం నిర్వహించారని, ఈ మేరకు వచ్చిన సమాచారంతో గాలింపులు నిర్వహించామని, ఆ ప్రదేశంలో మావోయిస్టులు ఆయుధాలు తయారుచేస్తున్నట్లుగా తమకు రూఢీ అయిందని ఆయన తెలిపారు.



# పార్ట్ టైం ఉపాధ్యాయులా, హమాలీలా!



అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ కొన్ని జిల్లాలోని మండల విద్యా కేంద్రాలలో మండల విద్యాశాఖ అధికారులు లు పార్ట్ టైం బోధకులను హమాలీలుగా చూస్తున్నారని రాష్ట్ర పార్ట్ టైం ఉపాధ్యాయుల సంఘం (ఆర్ట్,వర్క్,హెల్త్) అధ్యక్షులు గొల్ల ఆదిశేషయ్య ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన " జగనన్న విద్యా కానుక" పథకంలో భాగంగా సమగ్ర శిక్ష లో పనిచేస్తున్న పార్ట్ టైం బోధకులను కాంట్రాక్టు , పొరుగు సేవలు ఉద్యోగులను విద్యార్థులకు పుస్తకాలు,బూట్లు,బెల్టులు,యూనిఫామ్ లు అందించాల్సిందిగా వీధులను వేశారు.ఇందులో భాగంగా మండల కేంద్రాలలో పనిచేస్తున్న పార్ట్ టైం బోధకులను ఆయా మండల పరిధి లోని పాఠశాలలకు జగనన్న విద్య కానుకను చేర్చాలి.తరువాత పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైం బోధకులను అయిన తాము విద్యార్థులకు పుస్తకాలను అందివ్వగలమని,అలా కాకుండా 40 నుండి 50 కేజీ ల బరువున్న పుస్తకాల కిట్ లను తమతో హమాలీలుగా మోపించడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు..

వివిధ జిల్లాలో రెగులర్ ఉపాధ్యాయుల నెలకు జీతాలు వేళల్లో, లక్షల లో ఉన్నా వారికి విధులు కేటాయించకుండా ఇంటికే పరిమితం చేస్తున్నారు, కేవలం 14,203/ జీతం తో పనిచేస్తున్న తమను వేధింపులకు గురిచేయడం,అలాగే కిట్ లు మొయ్యకుంటే డ్యూటీ సర్టిఫికెట్లు పై సంతకాలు చేయం అని మండల విద్యాశాఖ అధికారులు అనడం సరికాదన్నారు..ఇప్పటికైనా సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు స్పందించి పార్ట్ టైం ఉపాధ్యాయుల విధులు కేవలం పాఠశాలలకు మాత్రమే పరిమితం అయ్యేలా ఉత్తర్వులు ఇవ్వాలని..లేని పక్షంలో ఈ విషయాన్ని సమగ్ర శిక్షా పథక సంచాలకులు అయిన శ్రీమతి వెట్రీ సెల్లి గారి దృష్టి కి తీసుకు వెళ్తామని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ సంఘ నాయకుడైన ఆదిశేషయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెబ్‌సైట్ హ్యాక్!



దిల్లీ: పాకిస్థాన్‌కు చెందిన కొందరు హ్యాకర్లు భారత్‌లోని ప్రముఖుల వ్యక్తిగత వెబ్‌సైట్లను లక్ష్యంగా చేసుకొని రెచ్చిపోతున్నారు. తాజాగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్ రెడ్డి వ్యక్తిగత వెబ్‌సైట్‌ను హ్యాక్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కిషన్ రెడ్డి వెబ్‌సైట్ హ్యాక్‌కు గురైంది. ఆయన వ్యక్తిగత వెబ్‌సైట్‌లో పాకిస్థాన్ అనుకూల నినాదాలు పెట్టడంతో పాటు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ హ్యాకర్లు సందేశాలు పెట్టారు. ఈ విషయాన్ని హైదరాబాద్‌లోని కిషన్ రెడ్డి కార్యాలయం మంగళవారం ధ్రువీకరించింది. హ్యాకింగ్ అనంతరం ఆయన వెబ్‌సైట్ (kishanreddy.com)ఓపెన్ చేస్తే 'తాత్కాలికంగా అందుబాటులో లేదు' అనే సందేశం వస్తోంది. కిషన్‌రెడ్డి వెబ్‌సైట్‌లో ప్రభుత్వానికి సంబంధించిన ఎలాంటి సమాచారమూ లేదని అధికారులు తెలిపారు.

ఆయన వ్యక్తిగత వివరాలతో పాటు రోజువారీగా ఆయన పాల్గొంటున్న కార్యక్రమాలు, రాజకీయ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం మాత్రమే ఉందని స్పష్టంచేశారు. ఈ వెబ్‌సైట్‌లో కిషన్ రెడ్డి వ్యక్తిగతమైన వివరాలతో పాటు ఆయన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు మాత్రమే ఉన్నాయని.. ఇవన్నీ పబ్లిక్ డొమైన్‌లో ఉన్నవేనని చెప్పారు.

# గ్రంథాలయంను ప్రారంభించిన పర్యాటక శాఖ మంత్రి అవంతి



భీమునిపట్నం : జివియంసి 2వ వార్డు తగరపువలస లో రూ. 33 లక్షల తో నూత నంగా నిర్మించిన గ్రంథాలయం ను మంత్రి అవంతి శ్రీనివాసరావు మంగళవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస రావు మాట్లాడుతూ విద్యార్థనీ విద్యార్థులు విద్యార్థి దశనుండే గ్రంథా లయాలకు వెళ్లి జ్ఞానాన్ని సముపార్జించుకుని ఉన్నత శిఖరా లను అధిరోహించాలన్నారు. గ్రంథాల యాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గ్రంథాలయాలు విజ్ఞానంతో పాటు మేద సంపత్తిని పెంపొం దిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ సి.హెచ్ గోవిందరావు, టి పిఆర్ ఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఈశ్వర రావు, ఇఇ శంకర్రావు ఎఇ సుమన్, ఇన్ ఛార్జ్ మహేష్, జివి ఎంసి రెండవ వార్డ్ వైకాపా కా ర్పోరేట్ అభ్యర్థిని ఎస్ సరళారాణి కరుణాకర్ రెడ్డి, ఎస్ గిరిబాబు, వంశీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పలాస వాసి మద్దు ప్రకాష్ అనే మత్సకార యువకుడు విద్యుత్ ఘతానికి గురియై విశాఖ కేజీహెచ్ లో చికిత్స పొందుతూ మరణించారు. ఈ విషయాన్ని సాయి పూజా ఫౌండేషన్ ఛైర్మన్, జివియంసి మాజీ కార్పొరేటర్ వానపల్లి రవికుమార్‌కి యల్లాజి, ధనలక్ష్మి సమాచారం ఇచ్చారు. అతని అంతిమ సంస్కారాలకు రవికుమార్ సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో యల్లాజి, ధనలక్ష్మి, వార్డ్ కార్యదర్శి సారిపల్లి మహేష్, రాము, శ్రీనివాస్, వారి కుటుబ సభ్యులు పాల్గొన్నారు.

## సింధూర అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుని దర్శనం



స్వయంభూ విఘ్నేశ్వర స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతిరావు

చోడవరం : పట్టణంలోని మరో కాణిపాకంగా విరాజిల్లుతున్న స్వయంభు విగ్నేశ్వర స్వామి వారు నాలుగవ రోజు మంగళవారం సింధూర అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చ కులు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో స్వామివారికి అలం కరణ నిర్వహించి, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కార్య సిద్ధి విఘ్నేశ్వర స్వామి వారి దర్శనం కల్పించారు. గణేష్ మాల దారులు, స్థానిక భక్తులతోపాటు, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజా కార్య క్రమాలు నిర్వహించారు.

# బీసీల ఆత్మబంధువు వైయస్ జగన్మోహన్‌రెడ్డి



భీమునిపట్నం : బీసీల ఆత్మబంధువు వైయస్ జగన్మోహన్ రెడ్డి. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా మొత్తం 139 బీసీ కులాలకు గాను సీఎం వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి కి చెందుతుందని పూలే అంబేద్కర్ ఆశయాలను నూటికి నూరు శాతం అమలు చేస్తున్న వైయస్ జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు అభినందనలు. బీసీ ప్రజా సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు పిల్లి నూకరాజు, ఉపాధ్యక్షులు చిత్రాడ అప్పారావు మంగళవారం పెదవాల్తేరు సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలియజేశారు బీసీల అభివృద్ధి ఒక్క జగన్ మోహన్ రెడ్డి తోనే సాధ్యమని గత ప్రభుత్వాలు బీసీలను కేవలం ఓటు బ్యాంకు గానే ఉపయోగించుకున్నారని, కానీ వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు చిత్తశుద్ధితో బీసీల అభివృద్ధికి పాటుపడుతున్న అని పార్లమెంటులో మొట్టమొదటిసారి బీసీ బిల్లు ప్రవేశపెట్టిన ఘనత %ఎంతీఎజూ% కి దక్కుతుందని. అదేవిధంగా చంద్రబాబు నాయుడు సరైన నివేదికలు ఇవ్వని కారణంగా బీసీల రిజర్వేషన్లపై కోర్టుల్లో తప్పుడు కేసులు వేయడం వలన హై కోర్ట్ 24 శాతానికి బీసీ రిజర్వేషన్లు కుదించిన వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు పార్టీపరంగా 10 శాతం పెంచడం బీసీల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని తెలుపుతుంది. అంతేకాకుండా వైఎస్‌ఆర్సీపి ప్రభుత్వంలో బీసీలకు కార్పొరేషన్ పదవుల్లో, పనుల్లో కూడా బడుగు బలహీన వర్గాలకు 50% రిజర్వేషన్లు కల్పించిన ఏకైక సీఎం వైయస్ జగన్. రాష్ట్రం లో గల బీసీ లందరూ గత ఎన్నికల్లో వైఎస్‌ఆర్సీపి కి సపోర్ట్ చేసి అఖండ విజయం చేకూర్చారని ఇప్పుడు కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో వీళ్ళందరూ వైయస్సార్ సిపి కి అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొడ్డు కన్నారావు, లక్ష్మణరావు , బత్తిన త్రినాధ రావు తదితరులు పాల్గొన్నారు.

## భోగాపురం ఎయిర్ పోర్టు మిగిలి భూములు 500 ఎకరాలు రైతులకే ఇవ్వాలి

విశాఖపట్నం : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి భోగాపురం ఎయిర్ పోర్టు భూముల్లో 2703 ఎకరాల నుంచి 2203 ఎకరాలకు కుదించినట్లు ప్రకటించారు. మిగిలిన 500 ఎకరాల వల్ల రూ.1500 కోట్లు ఆదా అవుతుందని కూడా ప్రకటించారు. మిగిలిన భూములు రైతులకు సంబంధించినది కాబట్టి మిగులు భూములు రైతులకే ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నది. విశాఖ ఎయిర్ ట్రావలెర్స్ అసోషియేషన్‌తో సహా భోగాపురం ఎయిర్ పోర్టు కావాలని ఎవరూ డిమాండ్ చేయలేదు. భోగాపురం విశాఖలోని అత్యధిక మంది ప్రయాణికులకు ఎవరికీ అనుకూలంకాదు. ఇప్పుడు ఉన్న విశాఖ విమానాశ్రయం ప్రజలందరికీ అత్యంత అనుకూలమైనది. కేవలం కార్పొరేట్ జిఎంఆర్ కంపెనీ కోసం ఈ ఎయిర్ పోర్టును నిర్మించాలని వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం నిర్ణయించడం సరైనదికాదు. ఈ ఎయిర్‌పోర్టు ఎవరి ప్రయోజనం కోసం నిర్మిస్తున్నారు? భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం తరువాత హైదరాబాద్‌లో బేగంపేట లాగానే విశాఖ విమానాశ్రయాన్ని డిఫెన్స్‌కు అప్పగిస్తారు. ప్రయాణికులకు ఎవరికీ ఉపయోగం వుండదు. విశాఖ విమానాశ్రయాన్ని కొనసాగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పగలదా? 2016లో భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మించాలని నిర్ణయించినప్పుడు జగన్మోహన్‌రెడ్డి గూడెంవలస గ్రామంలో బహిరంగ సభ పెట్టి నేను అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులందరికీ మొత్తం భూములన్నీ తిరిగి ఇప్పిస్తానని వాగ్ధానం చేశారు. భోగాపురం వద్ద విమానాశ్రయాన్ని వ్యతిరేకించారు. కాని అధికారంలోకి వచ్చిన తరువాత ప్లేటుమార్చి జిఎంఆర్‌తో లాలూచిపడి ప్రజలకు ద్రోహం చేయడం అన్యాయం. అవసరం లేకపోయినా ప్రజాధనం వేలకోట్లలో ఖర్చుపెట్టి భోగాపురం నుంచి అగనంపూడి వరకు మెట్రో రైలు నిర్మించడానికి మరో పథకాన్ని రూపొందించడం కూడా కార్పొరేట్ కంపెనీ ప్రయోజనం కోసమే. ఇప్పటికైనా వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ నిర్ణయాన్ని విరమించుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తున్నది. మాట మార్చనని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి భోగాపురం ఎయిర్ పోర్టు విషయంలో మాట మార్చడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది.

## బహిరంగంగా మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు

### వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ శ్రావణ్‌కుమార్

కంచరపాలెం : విశాఖ కమిషనరేట్ వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో కంచరపాలం, ఎయిర్‌పోర్ట్, గోపాలపట్నం,పెందుర్తి పోలీస్ స్టేషన్ ల పరిధిలో మందు బాబులు ఎవరైనా మద్యం దుకాణాల వద్ద గాని,లేదా ఇతర ప్రదేశములలో గాని బహిరంగంగా మద్యం సేవిస్తే కఠినంగా వ్యవహరిస్తమని వెస్ట్ సబ్ డివిజన్ ఇంచార్జ్ ఏసీపీ శ్రావణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగంగా ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడితే చట్ట పరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేసి కోర్ట్ లో హాజరు పరుస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకు బహిరంగంగా మద్యం తాగుతు జనవరి నుంచి నేటివరకు వరకు కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 169మంది,ఎయిర్ పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 207 మంది, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో 99మంది, పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 441 మంది మొత్తంగా 916 బహిరంగ మందు బాబులు పై పోలీస్ వారు కేసులు నమోదు చేసినట్లుగా తెలిపారు.

# మహిళ మెడ లో బంగారం గొలుసు చోరీ ...



కంచరపాలెం : నడుచుకుంటూ వెళ్తున్న మహిళా మెడలో బంగారం గొలుసు చోరీ చేసిన ఘటన జీవీఎంసీ 36 వ వార్డు పరిధి కంచరపాలెం రవేంద్ర నగర్ వద్ద మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ఈ మేరకు బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. బాపుజీ నగర్ రైతు బజర్ వద్ద నివాసముంటున్న కొయ్య వెంకటలక్ష్మి (30) మంగళవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో రవీంద్రనగర్ కూడలి సేవ మార్గం మీదుగా సమీప ఆలయానికి నడచుకుంటూ వెళ్తున్న వెంకటలక్ష్మి మెడలో ఆర తులం బంగారు గొలుసు గుర్తు తెలియని వ్యక్తి తెంచుకొని పరారయ్యాడు. వెంకటలక్ష్మి తేరుకునేలోపే నిందితుడు అక్కడి నుండి పరుగు తీశాడు. దీంతో చేసేది లేక వెంకట లక్ష్మి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న క్రైం ఇంఛార్జ్ సిఐ అవతారం, కంచరపాలెం సిఐ కృష్ణరావు, ఎస్ఐలు అప్పలనాయుడు,సుదర్శనరావు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితి సమీక్షించారు.

## దూరవిద్యలో ప్రవేశాలకు ఆహ్వానం

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ దూర విద్య అధ్యయన కేంద్రంలో డిగ్రీ, పీజీ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు అధ్యయన కేంద్రం సమన్వయాధికారి ఎం.వి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంబీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. సెప్టెంబరు 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.www.braou.ac.in వెబ్‌సైట్‌లో ఫీజు వివరాలు చూడాలన్నారు. వివరాలకు 0891-2536673 నెంబరులో సంప్రదించాలన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సహాయం వెంటనే ఇవ్వాలి

### - చోడవరం డివిజన్ స్థాయి భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి కొసర తాతారావు



లేబర్ ఆఫీసర్ లేకపోవడంతో దిగువ స్థాయి సిబ్బంది కి వినతిపత్రం అందిస్తున్న కార్మిక యూనియన్ కార్యదర్శి కొసరా తాతారావు

చోడవరం : కరోనా కారణంగా కూలి పనులు నష్టపోయిన భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం ఇవ్వాలని, చోడవరం డివిజన్ స్థాయి భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి కొసర తాతారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చోడవరం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కార్యా లయం వద్ద మంగళవారం వినతి పత్రం అందజేశారు. అలాగే చోడవరం లేబర్ ఆఫీసర్ గత నెలలో ట్రాన్స్ఫర్ కాగా, ఎలమంచిలి అధికారిని ఇక్కడ ఇన్చార్జిగా వేయడం జరిగిందని, అయితే పూర్తిస్థాయిలో ఈయన సేవలు అందకపోవడంతో చాలా వరకూ పనులు పెండింగ్లో ఉన్నాయన్నారు. 18 నెలల నుండి మహిళా కార్మికులకు ప్రసూతి సహా యం అందడం లేదని, కార్మికులకు భీమా సొమ్ము అందలేదన్నారు. చోడవరం డివిజన్ లో 16 మండలాల్లో వేలాది మంది కార్మికులు ఉన్నా రని, వారందరికీ సకాలంలో సేవలు అందేలా పర్మినెంటు లేబర్ ఆఫీసర్ వేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఈనెల 28 వరకు సచివాలయంలో గ్రీవెన్స్



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ : వైయస్సార్ ఆసరా సోషల్ ఆడిట్‌లో భాగంగా గొలుగొండ మండలంలో 1007 స్వయం సహాయక సంఘాలకు 28 కోట్ల 87 లక్షలు 11250 మెంబెర్స్‌కు తయారు చేసిన సంఘాల వారీగా సిఇఒ, ప్రాజెక్ట్ డైరెక్టర్, డిఆర్‌డిఎ వారి ఆదేశాలు ప్రకారం 20 సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు 20 సచివాలయంలలో గ్రీవెన్స్‌లు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్స్, వెలుగు విఒఎలు పాల్గొన్నారు.

## సార్క్ నేషన్స్ అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా ఇన్‌ఛార్జిగా తమ్మినేని రాజు



కంచరపాలెం : సార్క్ నేషన్స్ అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా ఇన్‌ఛార్జి గా తమ్మినేని రాజు నియమితులైనట్లు సార్క్ నేషన్స్ అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్ కంచారణ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సంస్థ ఫౌండర్ జి.ప్రశాంత్ ఆదేశాల మేరకు మురళీనగర్‌లో ఆయన నివాసం వద్ద మంగళవారం ఉదయం తమ్మినేని రాజు నియమాపక పత్రాన్ని అందజేశారు. చట్టం మీద అవగాహన ప్రజాస్వామ్య పరిరక్షణ పై ప్రజలు లో అవగాహన కల్పించేలా సదస్సులు నిర్వహించి చట్టాలపై ప్రజలను చైతన్య పరచాలని సూచించారు.

## సీపీఎం భీమిలి మండల కమిటీ ఆధ్వర్యంలో చిట్టివలస సచివాలయం వద్ద నిరసన



భీమునిపట్నం : ప్రభుత్వ వైద్య రంగాన్ని తక్షణమే బలోపేతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం భీమిలి మండల కమిటీ ఆధ్వర్యంలో చిట్టివలస సచివా లయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రిలో సహితం ప్రభుత్వ మార్గ దర్శకాలకు అనుగుణంగా ఉచితంగానే కరోనా నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు, ప్రభుత్వం ఏ చేసిన క్వారంటైన్ కేంద్రాలతో పాటు, హోమ్ క్వారంటైన్ లో ఉన్న కోవిడ్ -19 బాధితులందరికీ ఉచితంగా మందులు, పౌష్టికాహరం ఇవ్వా లన్నారు, ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రవ్వ నర్సింగరావు, మండల నాయకులు ఎస్.అప్పలనాయుడు, చింత పల్లి అప్పయ్యమ్మ, కర్రి రాము, అన్నాబత్తుల నర్సింగరావు, పి.కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.


**ఉత్తర రైల్వే**

**ఇ-ప్రొక్యూర్‌మెంటు పద్ధతి ద్వారా టెండర్లు ఆహ్వానం**

భారత రాష్ట్రపతి తరపున ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజరు, ఉత్తర రైల్వే న్యూఢిల్లీ-110001 వారు క్రింద పేర్కొన్న ఐటమ్‌లకు ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

| క్ర. సంఖ్య | టెండరు నెం. | సంక్షిప్త వివరణ | పరిమాణం | గడువు తేదీ |
|---|---|---|---|---|
| 1 | 09202376 | క్యాజిల్ నట్టు, వాషర్‌తో M-24X75 మిమీ ఫిట్ బోల్టు | 53757 నెంలు | 19.09.20 |
| 2 | 09202330 | టాప్ సైడ్ బేరర్ లైనరు | 13395 నెంలు | 21.09.20 |
| 3 | 09193039 | పియు పెయింట్లు కిట్ | 322 సెట్ | 21.09.20 |
| 4 | 09203054 | రెడీ మిక్స్‌డ్ పెయింట్, బ్రషింగ్, బిట్యుమినస్, బ్లాక్ | 31220 లీటర్లు | 22.09.20 |

గమనిక :- 1. విక్రేతలు వివరాలకై IREPS వెబ్‌సైటు అనగా www.ireps.gov.in ను చూడగలరు.
2. మ్యాన్యువల్ ఆఫర్లు అంగీకరించబడవు

టెండరు ప్రకటన నెం.19/2020-2021 తేదీ: 25.08.2020 1842/2020

వినియోగదారులకు చిరునవ్వుతో సేవలు

# విజయభాను సంపాదకీయం

## కష్టం నేర్పిన క్రమశిక్షణ

'మేధో చర్చలు లేదా, హేతుబద్ధత ద్వారా క్రమశిక్షణ రాదు. కష్టకాలంలో మాత్రమే అది అలవడుతుంది' అన్నాడు మహాత్మా గాంధీ. 'స్వాతంత్ర్యం అంటే స్వీయ క్రమశిక్షణ పాటించడం, స్వచ్ఛందంగా చట్టబద్ధ పాలనను ఆమోదించడం' అని కూడా గాంధీ బోధించాడు. 'కరోనా కష్టకాలం'లో వినాయక చవితి పండుగను అత్యంత క్రమశిక్షణతో జరుపుకున్నందుకు తెలంగాణ ప్రజలు అభినందనీయులు. కరోనా సందర్భంగా సామూహిక కార్యక్రమాలు చేపట్టవద్దని, ఇళ్ళలోనే జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి ప్రజలు సానుకూలంగా స్పందించారు, స్వచ్ఛందంగా అమలు చేశారు. ఇది తెలంగాణ సమాజం మనో నిబ్బరతనే కాదు, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ద్వైదీభావన లేదనే వాస్తవాన్ని కూడా ఎత్తి చూపుతున్నది.

గణేశ నవరాత్రి ఉత్సవాలు వచ్చాయంటే చాలు భాగ్యనగరంతో సహా తెలంగాణవ్యాప్తంగా ఎంత కోలాహలం ఉంటుంది! ప్రత్యేకించి యువకులు, పిల్లలు సమష్టిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటారు. కానీ ఈ వినాయక చవితినాడు కాలనీలలోనే కాదు, అపార్ట్‌మెంట్‌లలో కూడా పిల్లలు గుమిగూడకుండా జాగ్రత్తలు పాటించారు. స్వాతంత్ర్య సమరంలో ప్రజలలో సమష్టి స్ఫూర్తి రగిలించి కదలిక తేవడానికి గణేశ్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మహారాష్ట్రలో ప్రారంభమైన ఈ ఉత్సవాలను అతి సులభంగా తెలంగాణ సమాజం స్వీకరించడానికి కారణం ఇక్కడి ప్రజల స్వభావమే. బతుకమ్మ, దసరా వంటి ఏ పండుగనైనా సామూహికంగా జరుపుకోవడం తెలంగాణ ప్రజల అలవాటు. పండుగల సందర్భంగా ఫలహారాలు ఇచ్చిపుచ్చుకుంటారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొంటారు. కలివిడి సంస్కృతి ఇంత బలంగా నాటుకుపోయిన సమాజం ఇప్పుడున్న క్లిష్ట పరిస్థితిని అర్థం చేసుకొని నిబ్బరంగా ఇంటికే పరిమితమై పండుగ జరుపుకోవడం విశేషమే.

సంస్కృతీ సంప్రదాయాలు నెలకొనడం వెనుక సమాజ అవసరాలు, హేతుబద్ధత ఉంటాయనే అవగాహన ఉన్నప్పుడు, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవాలనే స్పృహ కూడా ఏర్పడుతుంది. కరోనా ఇంకా మనలను వెంటాడుతూనే ఉన్నది. మనం అవలంబించే స్వీయ క్రమశిక్షణే కరోనాను అంతం చేయగల ఏకైక ఆయుధం. ప్రజలు ఇదే రీతిలో క్రమశిక్షణను పాటిస్తూ ఉంటే కరోనా జాడ లేకుండా పోతుంది.

బతుకమ్మ, దసరా పండుగలు ఎంతో దూరంలో లేవు. తెలంగాణ సమాజమంతా నియమబద్ధంగా ఉండి అతి తొందరగా కరోనా వైరస్‌ను నిర్మూలిద్దామంటూ దీక్ష బూనాలి. బతుకమ్మ, దసరా, దీపావళి మొదలుకొని పండగలన్నీ మళ్ళీ సామూహికంగా మరింత సంబరంగా జరుపుకొనే మంచి రోజులు త్వరలోనే వస్తాయని ఆశిద్దాం.

# కేంద్రమంత్రి శ్రీపాద్ ఆరోగ్యం విషమం



పనాజీ: కేంద్ర ఆయుష్‌శాఖ మంత్రి శ్రీపాద్ నాయక్ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. ఆయనలో ఆక్సిజన్ లెవెల్స్ పడిపోయాయని గోవా సీఎం ప్రమోద్ సావంత్ చెప్పారు. కరోనా మహమ్మారి బారిన పడిన శ్రీపాద్ నాయక్ ప్రస్తుతం గోవా రాజధాని పనాజీలో ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వైద్య పరీక్షల్లో కరోనా పాజిటివ్ అని రావడంతో శ్రీపాద్‌నాయక్ ఈ నెల 12 నుంచి పనాజీలోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు.

**హర్యానా స్పీకర్‌కు కరోనా**

హర్యానా అసెంబ్లీ స్పీకర్ జియాన్ చంద్ గుప్తాతో సహా మరో ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో కరోనా పాజిటివ్ అని వచ్చిందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి అనిల్ విజ్ సోమవారం తెలిపారు. వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి రెండు రోజుల ముందు స్పీకర్‌కు వైరస్ సోకిందన్నారు. ఆరుగురు అసెంబ్లీ సిబ్బందికి కూడా కరోనా సోకింది. అయితే, స్పీకర్ గైర్హాజరులో డిప్యూటీ స్పీకర్ రణబీర్ గంగ్వా సభా కార్యకలాపాలను నిర్వహిస్తారు.

కోమాలోనే ప్రణబ్

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్యంలో ఎటువంటి మార్పు లేదని, ఆయన కోమాలోనే ఉన్నారని ఢిల్లీలోని ఆర్మీ రీసెర్చ్ అండ్ రిఫరల్ దవాఖాన తెలిపింది.

శ్వాసకోశ సంబంధ ఇన్‌ఫెక్షన్‌కు వైద్యులు చికిత్సనందిస్తున్నారని పేర్కొంది.

వెంటిలేటర్ మద్దతుపై చికిత్సనందిస్తున్నట్లు వెల్లడించింది.

# జర్నలిస్టు హత్యా కేసులో ముగ్గురు అరెస్టు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని బల్లియా జిల్లా ఫెఫ్నా గ్రామంలో జరిగిన జర్నలిస్టు హత్య కేసులో పోలీసులు మంగళవారం ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్టు చేశారు. మిగతా నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. గడిచిన సోమవారం రాత్రి రతన్ సింగ్ అనే జర్నలిస్ట్ హత్యకు గురయ్యాడు. ఈ విషయమై అజంఘర్ డీఐజీ సుభాష్‌చంద్ర దూబే స్పందిస్తూ... మృతుడు జర్నలిస్టు అయినప్పటికి హత్య జర్నలిజానికి సంబంధించినది కాదన్నారు. ఇది పూర్తిగా రెండు వార్గాల మధ్య చోటుచేసుకున్న భూ వివాదం అని తెలిపారు. గ్రామ పెద్ద నివాసంలో జర్నలిస్ట్ రతన్ సింగ్ హత్యకు గురయ్యాడు. పాత తగాదాలే ఇందుకు కారణంగా సమాచారం. కేసు దర్యాప్తు కొనసాగుతుందని అతి త్వరలోనే నిందితులందరిని అరెస్టు చేస్తామని బల్లియా ఎస్పీ దేవేంద్రనాథ్ తెలిపారు. గ్రామ పెద్ద జబార్‌సింగ్ కుట్ర చేసి తన కొడుకును హత్య చేయించాడని మృతుడి తండ్రి వినోద్ సింగ్ ఆరోపించారు. జబార్‌సింగ్ సోదరుడు సోను తన కొడుకుతో ఘర్షణకు పాల్పడినట్లు తెలిపాడు. అదేరోజు గ్రామాధిపతి నుంచి తమకు సాయంత్రం 5.30 గంటలకు పిలుపు వచ్చిందన్నారు. ఇంటికి వెళ్లగా తన కొడుకుని చంపేశారన్నాడు. మూడేళ్లక్రితం తన పెద్దకొడుకును కూడా గ్రామపెద్ద కుటుంబమే చంపినట్లు వినోద్ సింగ్ పేర్కొన్నాడు.

# సుశాంత్‌పై విషప్రయోగం?

ముంబయి: బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పూత్ మృతి కేసు రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. తాజాగా ఈ కేసుపై భాజపా ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి షాకింగ్ వ్యాఖ్యలు చేశారు. సుశాంత్‌పై విషప్రయోగం జరిగిందని.. ఈ విషయం తెలియకుండా ఉండేందుకే శవపరీక్షను ఆలస్యంగా నిర్వహించారని ఆయన సామాజిక మాధ్యమాల్లో ఆరోపించారు.

"హంతకుల క్రూర స్వభావం, వారి ప్రమేయం నెమ్మదిగా బయటకు వస్తోంది. ఎస్ఎస్ఆర్ జీర్ణాశయంలో ప్రయోగించిన విషం ఆనవాళ్లు లేకుండా పోవాలనే ఉద్దేశంతో.. శవపరీక్షను కావాలనే ఆలస్యం చేశారు. ఇందుకు బాధ్యులైన వారిని శిక్షించాలి." అంటూ స్వామి డిమాండ్ చేశారు. సుశాంత్ శవపరీక్ష నగరంలోని కూపర్ ఆస్పత్రిలో జరిగిందనే విషయం తెలిసిందే. ఆయన మరణించిన సుమారు 10-12 గంటల అనంతరం పోస్ట్‌మార్టం నిర్వహించారు. పోలీసులు నమోదు చేసిన ఫోరెన్సిక్ వివరాల్లో స్పష్టత లేకపోవటం కూడా పలు ఊహాగానాలకు తావిస్తోంది. కాగా, సుప్రీం ఆదేశం మేరకు కేసు దర్యాప్తు నిర్వహిస్తున్న సీబీఐ అధికారులు.. సుశాంత్ ఫ్లాట్‌కు వెళ్లి మరన్ని వివరాలు సేకరించారు.

# అద్భుతం! ఈ బాలుడు మృత్యుంజయుడు!

దిల్లీ : మహారాష్ట్రలో ఐదంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో నాలుగేళ్ల బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు. ఘటన జరిగి దాదాపు 18గంటల తర్వాత శిథిలాల కింద చిక్కుకున్న బాలుడు ఇలా ప్రాణాలతో సురక్షితంగా బయటపడటం అద్భుతమని అంటున్నారు స్థానికులు. ఈ ఘటనలో ఇంకా అదృశ్యమైన మరికొందరు కూడా ప్రాణాలతో బయటపడాలని ఆకాంక్షిస్తున్నారు. మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా మహద్ ప్రాంతంలో నిన్న రాత్రి ఐదంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో 70మందికిపైగా శిథిలాల కింద చిక్కుకున్నట్టు అధికారులు అంచనా వేశారు. అయితే, దాదాపు 22 గంటలుగా కొనసాగుతున్న సహాయక చర్యల్లో ఇప్పటివరకు 60మందికి పైగా రక్షించినట్టు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య 11కి చేరినట్టు సమాచారం. ఇంకొందరి ఆచూకీ తెలియాల్సి ఉంది.

రాత్రంతా చీకట్లోనే..!

శిథిలాల కింద చిక్కుకుపోయిన ఈ నాలుగేళ్ల బాలుడు చీకట్లో కూర్చొని ఉన్నట్టు గుర్తించిన ఇద్దరు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది.. కాంక్రీట్ శ్లాబ్‌ను తొలగించి సురక్షితంగా బయటకు తీసుకొచ్చారని చెప్పారు. అలాగే, బాలుడి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ వైద్యసాయం కోసం ఆస్పత్రికి తరలించారు. మూడు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, 12 అగ్నిమాపక దళాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. గ్యాస్ కట్టర్‌లు, ఇతర యంత్రాలను ఉపయోగించి శిథిలాలను తొలగిస్తున్నారు. పదేళ్ల క్రితం నిర్మించిన ఈ నివాసిత భవనంలో మొత్తం 45 ఫ్లాట్లు ఉన్నట్టు పేర్కొన్నారు.

ఇంకా శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది జాగిలాలను రంగంలోకి దించి గాలిస్తున్నారు.

ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

భవనం కూలిన ఘటనపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మరోవైపు, మంత్రులు ఏక్‌నాథ్ సింధే, అదితి తట్కరే ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అదితి సునిల్ తట్కరే మాట్లాడుతూ.. ఈ ఘటనలో గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించినట్టు తెలిపారు. అలాగే, వీరిలో కొందరు డిశ్చార్జి కాగా.. తీవ్ర గాయాలైనవారిని ముంబయిలోని ఆస్పత్రికి తరలించామన్నారు. దీనిపై దర్యాప్తు ప్రారంభమైనట్టు ఆమె వెల్లడించారు.

ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ భవనం కూలిపోవడానికి కారణాలేంటి అనేది మాత్రం ఇంకా తెలియరాలేదు.

## ఎస్పీబీ ఆరోగ్యం : చరణ్ ఏమన్నారంటే..?

చెన్నై: కరోనాతో పోరాడుతూ చెన్నై ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యుల చికిత్సకు ఆయన స్పందిస్తున్నారని ఎస్పీ చరణ్ తెలిపారు. ఈ మేరకు వీడియో సందేశాన్ని అభిమానులతో పంచుకున్నారు.

"ఈరోజు వైద్యులతో మాట్లాడాను. నాన్న ఆరోగ్యం నిలకడగా ఉంది. వైద్యుల చికిత్సకు ఆయన స్పందిస్తున్నారు. మీరు చూపిన ప్రేమ, అభిమానం, ఆశీర్వాదానికి మా కుటుంబం ఎంతో రుణపడి ఉంటుంది. ఎంజీఎం ఆస్పత్రి వైద్యుల బృందం కృషి గురించి ఎంత చెప్పినా తక్కువే. నాన్న కోలుకోవడంలో వాళ్లు నిరంతరం కష్టపడ్డారు. త్వరలోనే నాన్న మామూలు స్థితికి వస్తారని విశ్వసిస్తున్నా.

# కవి సమయం

## పల్లలే సౌభాగ్యాలంట

పెంచిన తల్లి పంచ్చల్లో వుంది
కనికారం కడవల్నిండా వుంది
కంచాల్లో తిండి పుష్టిగా తినమంటుంది
పల్లెల్లో ఆమాటుంది.
పండగ, పబ్బం - ఇంటింట
ప్రతి యింట - చుట్టాలంట
పల్లె సంపద - బతుకులు పంట
ఇంటింట - ఆనందాలంట.
పద్యం చదివితే...
మళ్ళీ, మళ్ళీ ఫలకాలంటు
ఈలలుతో ఉత్సాహలెంతెంతో
పౌరాణిక నాటకాలు పల్లెల్లో యింకెంతో
బతుకులు బాట - పల్లె, పేటల్లో
దానాలకు చల్లని - చేతుల్లు
చేతార నిండంట
చేతార పెట్టినవాడు
పల్లె, పేటంట.
పల్లె, పేటలు, కళకళలాడే రోజులు వస్తున్నాయ్
పల్లెలు కేమి కొరదే లేదని పిద్దాం
చూడముచ్చటగ - పల్లెలు- అనిపిద్దాం
గాంధీ చెప్పిన మాటలు
పల్లె, పేటలు సౌభాగ్యలంట.


... కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

# పంచాంగం

| మాసం : శ్రావణ ; తిథి : అష్టమి ప.2.35; అనూరాధ సా.5.42; రా.వ.11.02ల 12.33. | బుధవారం 26-08-2020 |
|---|---|

**మేషం** : ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. ఆత్మవిశ్వాసంతో సవాళ్ళను ఎదుర్కొంటారు. ఉద్యోగ భద్రత వల్ల భవిష్యత్ పట్ల భరోసా వస్తుంది. రాబోయే ఆదాయానికి తగినట్టుగా ప్రణాళికలు రూపొందించుకుంటారు. **వృషభం** : బంధువుల విషయంలో తలదూర్చడం కంటే మీ పనులు మీరు చేసుకోవడం మంచిది. మీ సంతానం మీ మాటను గౌరవిస్తారు. మీ సంతానంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతారు. స్త్రీలకు ప్రకటనలు, స్కీముల పట్ల అవగాహన అవసరం. **మిథునం** : దీర్ఘకాలంగా కోర్టులో ఉన్న కేసు ఒకటి మీకు ఊరట నిస్తుంది. స్త్రీలు గృహోపకరణాలు కొనుట పట్ల ఆసక్తి చూపుతారు. రాబడికి తగినట్లుగా ఖర్చులు ఉంటాయి. దైవ కార్యాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. తొందరపాటు నిర్ణయాల వల్ల కష్టనష్టాలు చవి చూడాల్సి వస్తుంది. **కర్కాటకం** : వృత్తుల వారు ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. సాహస ప్రయత్నాలు విరమించండి. పలుకుబడి ఉన్న వ్యక్తులతో పరిచయాలేర్పడతాయి. కుటుం బీకుల కోసం ధన బాగా వ్యయం చేస్తారు. ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. **సింహం** : పత్రిక, ప్రింటింగ్ రంగాల వారికి ఓర్పు, అంకితభావంతో శ్రమించాల్సి ఉంటుంది. స్త్రీలకు పనివారతో ఇబ్బందులు తలెత్తుతాయి. మీరు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మిత్రులను కలుసుకుంటారు. చేతివృత్తుల వారికి సదావకాశాలు లభిస్తాయి. విద్యార్థుల ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచింది. **కన్య** : ఇంటా బయట అధిక కృషి అనంతరం మంచి ఫలితాలను పొందుతారు. కొబ్బరి, పండ్ల, పూల, చిరు వ్యాపారులకు కలిసి రాగలదు. స్త్రీలకు ఆర్జనపట్ల ఆసక్తి, అందుకు అనువైన పరిస్థితులు నెలకొంటాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాలను చేజార్చు కుంటారు. **తుల** : నూతన టెండర్ల విషయమై ప్రముఖులతో సంప్ర దింపులు జరుపుతారు. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. స్త్రీలకు ఆరోగ్యకరమైన సంప్రదింపులు జరుపుతారు.. **వృశ్చికం** : రుణాలు తీరుస్తారు. మీ సంతానం వివాహం, విద్య విషయాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కను పరుస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. పోస్టల్, ఎల్.ఐ.సి ఏజెంట్లకు ఆర్థికంగా బాగుంటుంది. **ధనుస్సు** : ధన వ్యయంలో ఏకాగ్రత వహించండి. ఉద్యోగస్తులకు పనిభారం, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికంగా ఉంటాయి. దైవ, సేవా కార్యక్రమా లకు సహాయ సహకారాలు అందిస్తాయి. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. వస్త్ర, బంగారు, ఫ్యాన్సీ, పచారీ వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. **మకరం** : గృహ మార్పులు, మరమ్మతులు అనుకూలిస్తాయి. స్త్రీల, ఆలోచనలు, అభిప్రాయాలకు మంచి స్పందన లభిస్తుంది. **కుంభం** : వాహనం విలువైన వస్తువులు ఇతరులకిచ్చే విషయంలో లౌక్యంగా మెలగండి. విద్యార్థులు క్రీడలు, క్విజ్ పోటీల్లో రాణిస్తారు. గృహ నిర్మాణాలలో స్వల్ప అడ్డంకులు, చికాకులు ఎదుర్కొంటారు. **మీనం** :సత్కాలం ఆసన్నమైంది, మీ ఆలోచనలు, పథకాలు అమలు చేయండి. అనుకున్న పనులు ఆశించినంత చురుకుగా సాగవు. ఉద్యో గస్తులు యూనియన్ కార్య కలాపాల్లో తలమునకలై ఉంటారు. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు మంచి స్పందన లభిస్తుంది.

# షిర్డీ 'సాయిబాబా' జీవిత చరిత్ర



( గత తరువాయి)

పట్టి ఓడిపోయిన తరువాత బాబాలో చాలా మార్పు వచ్చింది. సూఫీ ఫకీరులలాగా మోకాళ్ళ వరకు ఉండే 'కఫనీ', తలకు టోపీలాగా చుట్టిన గుడ్డ ధరించడం మొదలుపెట్టారు. ఇలా ముస్లిం ఫకీరులా ఉండే బాబాకు స్థానిక హిందువులనుండి కొద్దిపాటి ప్రతిఘటన కూడా ఎదురయ్యింది.

1918లో తన మరణం వరకు సాయిబాబా షిరిడీలోనే ఉన్నారు. ఒక పాత మసీదును తన నివాసం చేసుకొన్నారు. యాచన అతని వృత్తి. మసీదులో ధునిని వెలిగించారు. అందులోనుండి విభూతిని తీసి తన దర్శనానికి వచ్చేవారికి పంచేవారు. అది తమకు రక్షణ ఇస్తుందని భక్తులు నమ్మేవారు. వచ్చిన వారికి ఉపదేశాలు, ధర్మ బోధలు చేసేవారు. చాలా మహత్తులు చూపించేవారని భక్తులు చెబుతారు. స్వయంగా వండి ప్రసాదాన్ని పంచేవారు. ఉత్సవాలలో పాల్గొనేవారు. ఒకోమారు విపరీతంగా కోపం చూపేవారు.

1910 తరువాత సాయిబాబా పేరు దేశమంతటా తెలిసింది. గొప్ప మహత్తులు చూపే సాదువనీ, లేదా అవతారమని విశ్వసించే భక్తులు పెక్కురు బాబా దర్శనానికి రాసాగారు.16 అక్టోబరు 15, 1918 మధ్యాహ్నం 2.30కి బాబా తన భక్తుని వడిలో మహా సమాధి చెందారు. ఆయన దేహం బూటెవాడలో ఖననం చేయబడింది. అక్కడే 'సమాధి మందిరం' నిర్మించబడింది.

**ముఖ్యమైన శిష్యులు**

సాయిబాబా తన మార్గానికి, ఉపదేశాలకు చెందిన సంస్థాగత ఏర్పాట్లు ఏవీ చెయ్యలేదు. ప్రత్యేకించి తన శిష్యులు అని చెప్పుకొనే వ్యవస్థ కూడా ఏమీ లేదు. ఆయన అందరికీ చెందినవారు. సకోరీకి చెందిన ఉపాసనీ మహారాజ్, అహమ్మద్ నగర్‌కు చెందిన మెహర్ బాబా వంటి సాయిబాబా భక్తులు ప్రసిద్ధులయ్యారు.

శ్రీ సాయిబాబా జీవిత సమయంలో కొందరు భక్తులు ఆయనను సదా అంటిపెట్టుకొని ఉన్నారు **వారిలో ముఖ్యులు:** మహాల్సాపతి, హేమాండ్ పంతు, శ్యామా, తాత్యా.

**బోధనలు**

మసీదు గొడకానుకొని ఉన్న సాయిబాబా, భక్తులతోడుగా తన దైనిక వ్యవహారాలలోను, బోధనలలోను సాయిబాబా హిందూమతానికి చెందిన సంప్రదాయాలనూ, ఇస్లాం సంప్రదాయాలనూ కూడా పాటించారు. నమాజ్ చదవడం, అల్-ఫతీహా మననం, ఖొరాన్ అధ్యయనం వంటి ఆచారాలను ప్రోత్సహించారు కాని చాలా ఇతర ఆచారాలను పాటించలేదు. ఆయన దుస్తులు కూడా సూఫీ ఫకీర్ తరహాలోనే ఉండేవి. మతం, కులం వంటి భేదాలపై ఆధారపడిన విద్వేషాలను పూర్తిగా వ్యతిరేకించారు. అలాగే సనాతన ఛాందస సంప్రదాయాలను, ఏ మతానివైనా గాని, ఖండించారు. తాను ఫకీరుగా ఉన్నా తన అనుయాయులను సామాన్య గృహస్థ జీవనం గడపమని చెప్పారు. ప్రార్థన, భగవన్నామస్మరణ, పుణ్యగ్రంథ పఠనం-వీటిని ప్రోత్సహించారు. ఖొరాన్ చదువమని ముస్లిములకూ, రామాయణం, భగవద్గీత, విష్ణు సహస్రనామ స్తోత్రం వంటివి పారాయణం చేయమని హిందువులకూ ఉపదేశించారు. నీతి బద్ధమైన జీవనం గడపమనీ, ఇతరులను ప్రేమించి సహాయం చేయమనీ చెప్పారు. తన భక్తులకు రెండు ముఖ్యమైన లక్షణాలు అలవరచుకోమని పదేపదే చెప్పారు - అవి శ్రద్ధ (విశ్వాసం, భక్తి, దీక్ష), సబూరి (ఓర్పు, సాధన). నాస్తికత్వాన్ని తప్పు పట్టారు. అశ్రద్ధ చేయకుండా బాధ్యతలు నెరవేర్చాలనీ, వ్యామోహానికి లొంగకుండా తృప్తులు కావాలనీ ఉపదేశించారు. రెండు మతాల గ్రంథాలనూ సాయిబాబా ఆదరించి వ్యాఖ్యానించారు. వాటిపై ఆయనకు లోతైన పరిజ్ఞానం ఉందని ఆయనతో ఉన్నవారు చెప్పారు. హిందూ మత విషయాలపై బాబా వ్యాఖ్యానాలలో

## సంకీర్తన

అద్వైతం, భక్తి అంశాలు కలగలిసి ఉండేవి. తన నివాస స్థానమైన మసీదుకు ద్వారకామాయి అని పేరు పెట్టుకున్నారు. భగవంతుడు అంతటా, అందరిలోనూ ఉన్నాడ నేది బాబా బోధనలలో ఒక ముఖ్యాంశం. సాయిబాబా ఉపదేశాలు ఇస్లామిక్ సిద్ధాంతాలకూ, ఉపనిషత్సూత్రాలకూ కూడా సరిపోతాయి.

ఈ లోకం నశ్వరమనీ, భగవంతుడిచ్చే మోక్షమే శాశ్వతమనీ చెప్పారు. సాధనలో గురువు ప్రాముఖ్య తను గురించీ, గురువునే దేవుడిగా భావించమనీ పదేపదే చెప్పారు. పూర్వపు కర్మల కారణంగా వివిధ ఫలితాలు సంభవిస్తాయని కూడా చెప్పారు. సాయిబాబా రచించిన గ్రంథాలేవీ లేవు. సాయిబాబా బోధనలు మౌఖికంగానే శిష్యులకు లభించాయి. అవి పెద్ద పెద్ద ఉపన్యాసాలు కావు. సమయానుసారంగా చేసిన చిన్న చిన్న ఉపదేశాలు. తన వద్దకు దర్శనానికి వచ్చిన వారిని తరచు సాయిబాబా దక్షిణ అడుగుతుండేవాడు. అలా వచ్చిన ధనాన్ని పేదలకు పంచిపెట్టేవారు.

## ఎన్‌యూజేఐ జర్నలిజం స్కూల్ గవర్నింగ్ కౌన్సిల్‌లోఎన్ఎన్ఆర్‌కు మరోసారి స్థానం



విశాఖపట్నం : సీనియర్ జర్నలిస్ట్ ఎన్.నాగేశ్వరరావు (ఎన్ఎన్ఆర్)కు మరో అరుదైన బాధ్యత వరించింది. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్‌యూజేఐ) ఆధ్వ ర్యంలో మూడు దశాబ్దాలుగా పని చేస్తున్న స్కూల్ ఆఫ్ జర్నలిజం (ఎస్ఓజే) గవర్నింగ్ కౌన్సిల్‌లో ఎన్.ఎన్.ఆర్.కు స్థానం దక్కింది. వరుసగా రెండవ పర్యాయం ఈ గౌరవాన్ని ఆయన దక్కించుకున్నారు. దేశ రాజధాని కొత్త ఢిల్లీ కేంద్రంగా 1992 నుంచి కార్య కలాపాలు నిర్వహిస్తున్న జర్నలిజం స్కూల్‌కు జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. జాతీయ స్థాయిలో ప్రముఖ ఆంగ్ల పత్రికలకు చెందిన పేరెన్నికగన్న సంపాదకులు జర్నలిజం స్కూల్ అధ్యక్షులుగా సేవలందించారు. ఎన్‌యూజేఐ ఉపాధ్య క్షునిగా వరుసగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన ఎన్.ఎన్.ఆర్.ను జర్న లిజం స్కూల్ పాలకమండలి సభ్యునిగా తీసుకుంది. జర్నలిజం స్కూల్ పూర్వ గవర్నింగ్ కౌన్సిల్‌లో ఎన్.ఎన్.ఆర్. కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆయన సేవలను గుర్తించిన పాలకమండలి మరోసారి కౌన్సిల్‌లోకి తీసుకుంది. ఈనెల 24వ తేదీన జరిగిన జర్నలిజం స్కూల్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. ఎన్‌యూజేఐ అధ్యక్షులు మనోజ్ మిశ్రా (ఢిల్లీ) ప్రధాన కార్యదర్శి సురేష్ శర్మ (లక్నో), ఎన్‌యూజేఐ పూర్వ అధ్యక్షులు ప్రెస్ కౌన్సిల్ పూర్వ సభ్యులు ఉప్పల లక్ష్మణ్ (హైదరాబాద్), జర్నలిజం స్కూల్ పూర్వ అధ్యక్షులు విజయ్ క్రాంతి (ఢిల్లీ) ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. ఎన్‌యూజేఐ పూర్వ అధ్యక్షులు, ప్రముఖ సంపాదకులు అశోక్ మల్లిక్ (చండీఘడ్) స్కూల్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడు సహా ఇరువురు ఉపాధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి మరో తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులతో నూతన కార్యవర్గం ఏర్పాటయ్యింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్.ఎన్.ఆర్. తెలంగాణ నుంచి ఆ రాష్ట్ర జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.రాజేంద్రనాథ్ కార్యవర్గంలో స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌యూజేఐ పూర్వ అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్‌కు ఎన్.ఎన్.ఆర్. ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్‌యూజేఐ స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్న శుభ తరుణంలో స్కూల్ ఆఫ్ జర్నలిజం గవర్నింగ్ కౌన్సిల్‌లో స్థానం లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశం వ్యాప్తంగా విధి నిర్వ హణలో ఉన్న పాత్రికేయులకు మెరుగైన వృత్తి నైపుణ్యం పెంపొం దించేందుకు ఎన్‌యూజేఐ జర్నలిజం స్కూల్ కృషి చేస్తుందని ఎన్.ఎన్.ఆర్. తెలిపారు. స్కూల్ ఆఫ్ జర్నలిజంలో స్థానం సంపాదించుకున్న ఎన్.ఎన్.ఆర్.ను జాప్ రాష్ట్ర కార్యవర్గం, విశాఖపట్నం కార్యవర్గం శుభాకాంక్షలు తెలియజేసింది.

## ఘనంగా టీడీపీ నేత పైలా జన్మదిన వేడుకలు



పరవాడ : మాజీ మండల అధ్యక్షులు, మాజీ ఆర్ఇసిఎస్ చైర్మన్, మాజీ జడ్పీటిసి సీనియర్ టీడీపీ నాయకులు పైల జగన్నాథ రావు జన్మదిన వేడుకలు మంగళ వారం ఉదయం తానాం గ్రామంలో ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. పెందుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టిడిపి నాయ కులు, కార్యకర్తలు, పైలా అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకొని కోవిడ్ నిబంధనలు పాటిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు కార్యకర్తలు నాయకులు సమక్షంలో పైలా తన జన్మదిన కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా పైలా అభిమానులు, రోగులకు, నిరుపేదలకు, పళ్ళు రొట్టెలను పంపిణీ చేశారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ శాసనసభ్యులు గండి బాబ్జీ,గండి రవి, మాజీ సర్పంచులు పైలా రామారావు, చింతకాయల ముత్యాలు, గొర్లి కనకారావు, మడక రాజుల నాయుడు, బొండా తాతారావు, బొడ్డుపల్లి అప్పారావు, టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థి అట్ట సన్యాసి అప్పారావు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు యాసరపు కనకారావు, పెదసెట్టి సత్యరావు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, రొంగలి గోపాలకృష్ణ,వర్రి హరి, రెడ్డి చిన్నా, చింతకాయల అమ్మోరు, పెద్ద శెట్టి రామారావు, వియ్యపు చిన్నా, స్థానిక నాయకులు దుంగల మహాలక్ష్మి నాయుడు(డి.ఎం.ఎల్), తదితరులు పైలా కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు. ఇతర మండలాలకు చెందిన నాయకులు కోవిడ్ దృష్ట్యా చరవాణి ద్వారా పైలాకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## రోడ్డుకు ఇరువైపులా 800 మొక్కలు నాటిన వైసీపీ నేతలు



కొయ్యూరు : జగనన్న పచ్చ తోరణం కార్యక్రమంలో భాగంగా సుమారు 800 మొక్క లను రాజేంద్రపాలెం పంచాయతీ కాకరపాడు నుండి సోలాబు వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా వైసిపి నాయకులు మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా వైసిపి నాయకులు బడుగు రమేష్ మాట్లాడుతూ రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణకు ఎంతగానే ఉపయోగపడుతుందన్నారు. అలాగే మంచిగాలి...

నడిచేవారికి నీడ కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయ కులు బల్ల ప్రసాద్, పొట్టిక శ్రీను, వెలుసూరి సోమరాజు, గ్రామస్థులు సోమయ్య, లోతా వెంకట్రావు, లోతా రమణ, అప్పలరాజు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే



బలిజిపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందించేందుకు అధికారులంతా కృషి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పేర్కొన్నారు. బలిజిపేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులెవరైనా ప్రభుత్వ పథకాలు పొందకపోతే వారి నుంచి ఈ శనివారంలోగా వినతులు స్వీకరించి అర్హుల జాబితాలోకి చేర్చాలని అధికారులను ఆదేశించారు. పార్వతీపురం నియోజకవర్గంలో రూ.16.50 కోట్లతో బీటీ రోడ్లు, రూ.7.70 కోట్లతో నాలుగు ప్రాంతీయ ఆస్పత్రుల భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.వి.అప్పారావు, తహసీల్దార్ పి.గణపతి, వైకాపా నాయకులు మురళీకృష్ణ, మామిడి శ్రీకాంత్, కార్యాలయ ఉద్యోగులు శ్రీనివాస్ రావు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి




ఏలూరు : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సాబ్జీ డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని పట్టణ, మండల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సాబ్జీ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, ముఖ్య మంత్రి అయ్యాక వాటిని విస్మరించారన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, 11వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, డీఏ బకాయిలు చెల్లిం చాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబరు ఒకటిన నిరశన దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. భీమవరం, పాలకోడేరు మండల కేంద్రాల్లో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపిమూర్తి, నిడదవోలులో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ పాల్గొన్నారు.

## భూ సంబంధిత వివాదములలో దాడి, దౌర్జన్యములులకు పాల్పడిన వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోబడును

విశాఖపట్నం : కార్డులు, సామానులు తీసుకొని వెళ్లిపోయినట్లు ఇచ్చిన ఫిర్యాదు పై ఎంవీపీ పోలీస్ స్టేషన్ నందు కేసు Cr.No.521/2020 U/s 447, 448, 427, 380, 342, 323, 506, 147 r/w 34 IPC నమోదు చేసి దర్యాప్తు లో భాగంగా నేరం లో పాల్గొన్న వారిలో మొత్తం 10 మంది 1) అనుమోలు రంజిత్ కుమార్, గుంటూరు, 2) కలిమిలి రాం ప్రసాద్ రెడ్డి, వెంకటగిరి నెల్లూరు, 3) మహమ్మద్ అక్బర్ ఖాన్, విశాఖపట్నం, 4) మహమ్మద్ అలీ, విశాఖపట్నం, 5) మహమ్మద్ బాషా, విశాఖపట్నం, 6) పెంటబొమ్మ శ్రీను, విశాఖపట్నం , 7) నాయక్ రంజిత్, విశాఖపట్నం, 8) వాసుపల్లి నవీన్ కుమార్, విశాఖపట్నం, 9) మద్ది రాజేష్ శేఖర్ రెడ్డి, విశాఖపట్నం, 10) చిక్కల గురుమూర్తి, విశాఖపట్నం అను వారిని (మొత్తం 10 మంది ఇప్పటివరకు) అరెస్ట్ చేసి జుడిషియల్ రిమాండ్ కు పంపడం జరిగింది. అంతేకాక నేరం జరిగిన దినం రాత్రి రిషికేష్ మార్బుల్ ఆఫీస్ నుండి తెసుకోని వెల్లినన సామగ్రిని కొంత మొత్తం నిందుతుల నుండి రికవరి చేయడం జరిగింది. సదరు స్థల వివాదము కొవ్వూరు శ్రీనివాస్ రెడ్డి మరియు గాబు రాఘవి రెడ్డి ల మధ్య యాజమాన్యపు హక్కు పొందుటకు గాను గతం లో పోలీస్ కేసులు నమోదు అయినట్లు గుర్తించడం అయినది. ఈ కేసు లో విశాఖపట్నం సిటీ పోలీస్ వారు నేరము జరిగి పిర్యాదు వచ్చిన వెంటనే స్పందించి ముద్దాయిలను గుర్తించి అరెస్ట్ చేసి కోర్ట్ ముందు హాజరు పరచి సెంట్రల్ జైలు కు పంపడమైనది, ముద్దయిలలో గతంలో ఒక హొం గార్డ్ గా పని చేసి మానేసిన మద్ది రాజేష్ శేఖర్ రెడ్డి ని కూడా అరెస్ట్ చేయడమైనది, అదే విధంగా వీరికి సహకరించిన మెరైన్ హొం గార్డ్ నవీన్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపడం అయినది.

భూ సంబందిత వివాదముల లో ఎవరైనా వ్యక్తులు దాడి, దౌర్జన్యములు లకు పాల్పడినా, అట్టి చర్యలకు ప్రోత్సాహించిన లేదా సహకరించిన వారి అందరిపై కఠినమైన చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోన బడును అని ఈ చర్య ద్వారా పోలీస్ వారు హెచ్చరించడం అయినది.

## స్వర్ణప్యాలెస్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన వ్యక్తుల కుటుంబసభ్యులకు రూ.50లక్షలు చెక్‌లు పంపిణీ



విజయవాడ : ఏపి డిప్యూటీ సిఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని... విజయవాడ స్వర్ణ ప్యాలెస్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రమాదం జరిగిన వెంటనే ఒక్క క్షణం ఆలోచించకుండా ఆర్థిక సహాయం ప్రకటించిన జగనన్న ప్రభుత్వం... విజయవాడ కలెక్టర్ క్యాంపు ఆఫీస్ కి చేరుకున్న మంత్రులు ఆళ్ల నాని, కొడాలి నాని, వెల్లంపల్లి శ్రీనివాస్ రావు, శాసనసభ్యులు సామినేని ఉదయబాను.. మల్లాది విష్ణు. ఒక్కో కుటుంబానికి, 50లక్షలు రూపాయలు చెక్ లు అందచేసీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని... పాల్గొన్న మంత్రులు కొడాలి నాని, వెల్లంపల్లి శ్రీనివాస్ రావు..MLA లు సామినేని ఉదయబాను, మల్లాది విష్ణు, కలెక్టర్ ఇంతియాజ్ 10మృతికి కారకులైన వారిపై కఠినంగా చర్యలు ఉంటాయి. ప్రభుత్వం నియమించిన కమిటీ రిపోర్ట్ లో స్వర్ణ ప్యాలెస్ ఘటన లో రమేష్ హాస్పిటల్ యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘన జరిగిన వెల్లడయింది.

ఇప్పటికే అగ్ని ప్రమాద ఘటన కు కారకులు అయినా వారిని అరెస్ట్ చేయడం జరిగింది. డాక్టర్ రమేష్ కోసం ప్రత్యేక పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి. విజయవాడ స్వర్ణ ప్యాలెస్ అగ్ని ప్రమాదం ఘటన బాద్యులను వదిలే ప్రసక్తే లేదు. భద్రత ప్రమాణాలు పాటించిన కోవిడ్ హాస్పిటల్స్ కు అనుమతి ఇస్తున్నాం.

ముఖ్యమంత్రి వైస్ జగన్మోహనరెడ్డి మానవత్వం స్పందించి మృతుల కుటుంబాలకు 50లక్షలు రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. విజయవాడ లో 6మంది కి కుటంబానికి 50లక్షలు చొప్పున చెక్ లు అందచేసాము. మిగిలిన ముగ్గురుకు బందర్ లో, మరొకరికి కందుకూరు లో చెక్ అందచేసే ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి నిత్యం విధి నిర్వహణలో శ్రమిస్తూ దురదుష్టవ శాత్తు కొంతమంది జర్నలిస్టు కరోనా తో మృతి చెంద టం అత్యంత బాధాకరం.. కోవిడ్ తో మృతి చెం ది న జర్నలిస్ట్ ల కుటుంబాలకు అండగా ఉండాలని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పేర్ని నాని రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్మోహనరెడ్డి దృష్టిలో పెట్టారు.. కోవిడ్ తో మృతి చెం ది న జర్నలిస్ట్ కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్మోహనరెడ్డి ద్రుష్టికి తీసుకు వెళ్తానని,, ప్రభుత్వం నుండి సానుకూలంగా నిర్ణయం రావడానికి కృషి చేస్తాను. విజయవాడ స్వర్ణ ప్యాలెస్ అగ్ని ప్రమాద ఘటన లో బాద్యులపై కఠినంగా వ్యవహరిస్తాం.రమేష్ హిస్పిటల్ కి సంబందించిన కోవిడ్ అనుమతులు రద్దు చేసాం. రమేష్ హాస్పిటల్ లో రోగులు నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టు విచారణ కమిటీ రిపోర్ట్ లో స్పష్ట మయింది. ప్రజలు ప్రాణాలతో చేలగటం ఆడితే ఎక్కడ కూడ రాజీ పడే ప్రసక్తే లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ హాస్పిటల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తాం. అన్ని హాస్పిటల్స్ కాదు...

కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాయలు వైఖరి మార్చుకో పోతే కఠినంగా వ్యవహరిస్తాం.... రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ హాస్పిటల్స్ రోగులకు అందుతున్న వైద్య సేవలపై నిరంతరం గమనిస్తున్నాం... ఎక్కడ అయినా ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యం నిర్లక్ష్యం ధోరణి తో వ్యవహరించవద్దు... ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లా లో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యవహరించిన ప్రైవేట్ హాస్పిటల్ పై చర్యలు చేపట్టాం. కఠినంగా వ్యవహరిస్తాం. ఎవరిని ఉపెక్షించే ప్రసక్తే లేదు.

## రూ.2000 నోట్లను ముద్రించలేదు : ఆర్‌బీఐ



ముంబయి: 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.2000 నోట్లను ఒక్కటి కూడా ముద్రించలేదని మంగళవారం రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా వెల్లడించింది. అలాగే 2018 నుంచి చలామణిలో ఉన్న ఆ నోట్ల సంఖ్య తగ్గుతూ వచ్చిందని బ్యాంకు తన వార్షిక నివేదికలో వివరించింది. 2018 మార్చి చివరి నాటికి 33,632 లక్షల నోట్లు వాడకంలో ఉండగా, 2019 మార్చి చివరి నాటికి ఆ సంఖ్య 32,910లక్షలుగా ఉందని, 2020 మార్చి చివరికి వచ్చే సరికి ఆ సంఖ్య 27,398లక్షలకు తగ్గిపోయిందని ఆ నివేదిక పేర్కొంది. 2020 మార్చి నెల చివరికల్లా మొత్తం నోట్ల పరిమాణంలో రూ.2000 నోట్ల పరిమాణం 2.4శాతంగా ఉందని, 2019, 2018 మార్చి చివరి నాటికి అది వరసగా 3శాతం, 3.3శాతంగా ఉందని తెలిపింది. విలువపరంగా చూసుకున్నా..2018 నుంచి 2020కి 37.3 శాతం నుంచి 22.6 శాతానికి పడిపోయింది. మరోవైపు 2018 నుంచి విలువ, పరిమాణం పరంగా..రూ.200, రూ.500 చలామణి పెరిగిపోయిందని నివేదిక వెల్లడించింది. కాగా, కరోనా మహమ్మారి వల్ల నోట్ల సరఫరా తీవ్రంగా ప్రభావితమైందని ఆర్‌బీఐ తెలిపింది. 'కొవిడ్ మహమ్మారి, లాక్‌డౌన్ కారణంగా మునపటి ఏడాదితో పోల్చుకుంటే నోట్ల సరఫరా 2019-20 సంవత్సరంలో 23.3 శాతం తగ్గిపోయింది' అని పేర్కొంది.

## ఏపీలో మరో 9900 కొత్త కేసులు

అమరావతి: ఏపీలో కరోనా వైరస్ శరవేగంగా వ్యాపిస్తోంది. గడిచిన 24గంటల్లో 9,927 కొత్త పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 3,71,639కి పెరిగింది. వీరిలో 2,78,247 మంది కోలుకొని డిశ్చార్జి కాగా.. 3,460 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం 89,932 యాక్టివ్ కేసులు ఉన్నాయి. తాజాగా 64,351 నమూనాలను పరీక్షించగా.. 9927 మంది కరోనా బారినపడ్డారని, అదేసమయంలో 9419 మంది కోలుకొని డిశ్చార్జి అయినట్టు ప్రభుత్వం బులిటెన్‌లో పేర్కొంది. వైరస్ సోకిన బాధితుల్లో కొత్తగా 92మంది మృత్యువాతపడినట్టు తెలిపింది. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 33,56,852 శాంపిల్స్‌ను పరీక్షించినట్టు వెల్లడించింది.

### చిత్తూరులో 16 మంది మృతి

రాష్ట్రంలో తాజాగా నమోదైన 92 కొవిడ్ మరణాల్లో చిత్తూరులో అత్యధికంగా 16మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే, అనంతపురంలో 11, కడపలో 10, ప్రకాశం 10, తూర్పుగోదావరి 8, పశ్చిమగోదావరి 8, గుంటూరు, నెల్లూరు, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో చెరో ఆరుగురు, కృష్ణా జిల్లాలో నలుగురు, విజయనగరంలో ఒకరు చొప్పున మృత్యువాతపడ్డారు.

### ఒక్క జిల్లాలోనే 52వేల కేసులు

తూర్పుగోదావరి జిల్లాలో కరోనా వైరస్ విజృంభణ కొనసాగుతోంది. ఇప్పటివరకు రాష్ట్రంలో అత్యధిక కేసులు నమోదైంది ఈ జిల్లాలోనే. తాజాగా అక్కడ 1,353 కేసులు నమోదవ్వడంతో మొత్తం కేసుల సంఖ్య 52,039కి పెరిగింది. తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటివరకు 33,946 మంది కోలుకొని డిశ్చార్జి కాగా.. 343 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం 17,750 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- కార్పొరేట్ హాస్పటల్స్‌లో ఫీజుల దందాను అరికట్టాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నర్సింగరావు డిమాండ్

విశాఖపట్నం : కరోనా కాలంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నరసింగ రావు విమర్శించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కరోనాను అడ్డం పెట్టుకొని భారతదేశాన్ని తాకట్టు పెట్టే చర్యలు చేపట్టిందన్నారు. ప్రజల సొమ్మును ఆరోగ్యశ్రీ పేర కార్పొరేట్ హాస్పటల్స్ కట్టబెట్టి నేడు కరోనా వైద్యం ప్రజలకు అందించకుండా లక్షల రూపాయలు దండుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ క్రింద వెంటవెంటనే కరోనా రోగికి వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నేడు సిపిఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం జరిగింది. సిహెచ్ నరసింగరావు పాల్గొని మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసే విధంగా, దేశ సంపదను బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే చర్యలు వేగవంతం చేసిందన్నారు. ప్రభుత్వం వైద్యానికి జిడిపిలో 15శాతం కేటాయించకపోవడం దుర్మార్గ మన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను నిర్లక్ష్యం చేయడంతో నేడు కరోనా బాధితులకు మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. మరో వైపు కరోనా రోగులకు వైద్యం అందించే డాక్టర్లకు, వైద్య సిబ్బందికి పిపిపి కిట్లు సైతం ఇవ్వడం లేదన్నారు. 50 లక్షల ప్రమాదభీమా కూడా అమలు చేయడంలో కూడా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. విశాఖలో ఉన్న విమ్స్ హాస్పటల్‌లో 1300 పడకలు ఏర్పాటుకు అవకాశం ఉన్నా దానిపై వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. విమ్స్‌లో అవసరమైన వైద్యులను, సిబ్బందిని పెంచాలన్నారు. ఈసమయంలోనే విమ్స్‌ను మల్టీస్పెషాలిటీ హాస్పటల్‌గా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. హౌస్ కోరంటైన్‌లో ఉన్న కరోనా బాధితులకు మందులు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి డా.బి.గంగారావు, నాయకులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, బి.జగన్, ఎం.సుబ్బారావు, జి.నాయనబాబు, ఆర్.పి.రాజు, కె.కుమారి, కె.సత్యన్నారాయణ, చంద్రమౌళి, డి.అప్పలరాజు, దండు నాగేశ్వరరావు, చంటి తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై దాడులకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు

## - రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతలు



విశాఖపట్నం : దేశ వ్యాప్తంగా దళిత, ఆదివాసీలపై కొనసాగు తున్న దాడులు, వివక్ష అణిచివేతకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్య మించాలని, కులవివక్షతకు తావులేని నవ సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ నడుంబిగించాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా అఖిలపక్ష, రాజకీయ పార్టీలతో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతిభవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 74ఏళ్లు గడచినా దళితులు, ఆదివాసీలు అణచివేతకు గురవుతున్నారని, వారిపై అత్యాచారాలు, దాడులు, వేదింపులు పెరిగిపోయాయని, రోజు రోజుకూ దేశ వ్యాప్తంగా అనేక సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని అవి దళితుల అణిచి వేతకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కూడా వైసీపీ కార్యకర్తలు పెట్రేగిపోతున్నారని వారి సహకారంతోనే ఈ మధ్య జరిగిన దాడులన్నీ జరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వం చర్యల వలన దళితులకు రక్షణ లేకుండా పోయిందని, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రిజర్వేషన్‌లు తొలగించడానికి కుట్రపన్నుతున్నాయని ఆరోపిం చారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సనపల నర్సింహులు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు పెరిగాయని, రాజకీయ పైరవీలు అలసత్వం, ప్రలోభాలు, అవినీతి వివక్ష వలన దళితులపై వరుస దాడులు జరుగుతున్నాయని, ఇసుక మాఫియాను ఎదరించినందుకు ముని కూడలికి చెందిన దళిత యువకుడు ఇండుగుమల్లి ప్రసాద్‌ను పోలీసులు శిరోముండనం చేయడంతో నక్సలైట్‌గా మారేందుకు అనుమతివ్వండని రాష్ట్రపతికి లేఖరాశాడంటే ఆయన ఎంత ఆవేదన చెందాడో అర్థం చేసుకోవాలన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న యువకుడు నక్సలైట్‌గా మారాలన్న ఆలోచన వచ్చిదంటే రాష్ట్రంలో వ్యవస్థలు ఎంత దిగజారాయో ప్రజలు ఆలోచించాలని దీనికి వ్యతి రేకంగా ఉధ్యమించాలని అన్నారు. కర్నూలు జిల్లా వెలుగోడులో గిరిజన మహిళపై అత్యాచారం, గుంటూరు జిల్లాలో గిరిజన మహిళ మంత్రాభాయ్ ని అప్పుచెల్లించలేదనే నెపంతో శ్రీనివాస రెడ్డి అనే ఆయన ట్రాక్టర్‌తో గుద్ది చంపాడంటే కుల వివక్ష ఎంత పెరిగిపోయిందో అర్థమవుతుందన్నారు. పలాస మండలం టెక్కలి పట్నానికి చెందిన దళితుడైన జగన్నాథరావును కాశీబుగ్గ సీఐ వేణుగోపాల్ బూటు కాలుతో తన్నిన సంఘటన, టెక్కలిలో డీహెచ్‌పీఎస్ నాయకులు యడ్ల గోపి, బోకర మోహనరావులపై దాడి వీటన్నింటి వెనుక అధికార పార్టీ అండదండలు ఉన్నా యన్నారు. ఈ వరుస సంఘటనలపై యాక్షన్ ప్లాన్ రూపొందిం చుకోవాల్సిన అవసరం ఉందని, దళితులపై దాడులకు నిరసనగా రాబోయే రోజుల్లో అన్ని పార్టీలు ఉధ్యమించాలని, గత కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ హయాంలలో దాడులు కొనసాగు తున్నాయని, నేడు వైసీపీ ప్రభుత్వ పాలనలో కూడా అదే పరిస్థితి దాపురించిందని, భవిష్యత్‌లో ఐక్యకార్యచరణతో ముందుకు వెళ్లే అవసరం ఉందని వక్తలు ఏకకంఠంతో తీర్మానించారు. ఈ రౌండ్‌టేబుల్ సమా వేశంలో ఏఐటీయుసీ గౌరవాధ్యక్షులు చిక్కాల గోవిందరావు, అధ్య క్షులు అనపాన షణ్ముఖరావు, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు పట్టా ప్రభావతి, టీడీపీ నాయకులు ఎస్‌వీరమణ మాదిగ, డీహెచ్‌పీఎస్ గౌరవాధ్యక్షులు బోకర మోహనరావు, డీహెచ్‌పీఎస్ నాయకులు యడ్ల గోపి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయ ుకులు పట్టా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించండి

గొలుగొండ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలని గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి కె.ధనలక్ష్మీ అన్నారు. ప్రస్తుత వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, కొద్దిపాటి జ్వరం వచ్చిన వెంటనే పిహెచ్‌సి సిబ్బందిని సంప్రదించాలని ఆమె కోరారు. కరోనా వ్యాధి పట్ల కూడా అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో మరిగించిన తాగునీటినే అందరూ తాగాలని సూచించారు.

# 20 మందికి కరోనా పరీక్షలు



కరోనా పరీక్షలు చేస్తున్న దృశ్యం

కొయ్యూరు : రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 20 మందికి కరోనా పరీక్షలు చేయడం జరిగిందని వైద్యాధికారి ధీరజ్‌కుమార్ తెలిపారు. అదే విధంగా జ్వరాలు అధికంగా ఉండ టం వల్ల మెడికల్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని, ప్రస్తుతం జ్వరాలు అదుపులో ఉన్నాయని ఆయన తెలిపారు.

# కష్టజీవులను ఆదుకోవాలి

## సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల ఆందోళన



కాకినాడ : కేంద్ర ప్రభుత్వం కరోనా వంటి విపత్కర పరి స్థితులలోనైనా కష్ట జీవులంద రినీ ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు దేశవ్యాప్త పిలుపులో భాగంగా జగన్నాథ పురం చిన్న మార్కెట్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ సెంటర్ వద్ద భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకట రమణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సంపన్నులకు వరాలు సామాన్యులపై భారాలు ఆపాలన్నారు.పట్టణాల్లో కూడా ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికి నెలకు రూ.7,500ల చొప్పున 6 నెలల పాటు ఇవ్వాలని, ప్రతి మనిషికి 10 కేజీల బియ్యం చొప్పున ఉచితంగా అందించాలని, నిరుద్యోగ భృతి ప్రకటించాలని కోరుతున్నామన్నారు.సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు కరోనాకు ముందునుంచే ఇసుక కొరతతో ఉపాధి కోల్పోయి చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి ప్రతి బిల్డింగ్ వర్కర్ కుటుం బానికి రూ.10,వేలు ఆర్థిక సహాయం అందిం చాలని సిఐ టియు డిమాండ్ చేస్తోందన్నారు.



ఈ కార్య క్రమంలో నాయ కులు వి.గిరి, కె.సత్తిబాబు, పి.ప్రసాద్, లక్ష్మణ రావు, అప్పారావు, ఎ.చిన్ని, ఎస్. శ్రీనివాస్, సూరి బాబు, భద్రం, సత్య నారాయణ తది తరులు పాల్గొన్నారు.

# జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన నిర్మాణ పనుల పురోగతి తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్





కాకినాడ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మంగళవారం తాడేపల్లి ఆయన క్యాంప్ ఆఫీస్ నుండి స్పందన పై, అన్ని జిల్లాల కలెక్టర్లతో వరదల కారణంగా ముంపు ప్రాంతాల్లో చేపట్టవలసిన సహాయక కార్యక్రమాలు,కోవిడ్-19, హౌస్ సైట్స్, జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల తో చేపట్టిన నిర్మాణ పనుల పురోగతి తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టర్ కార్యా లయం వివేకానంద హాలు నుండి జిల్లా కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జాయింట్ కలెక్టర్లు జి.లక్ష్మీశ, కీర్తి చేకూరి, జి.రాజకుమారి, రాజమహేంద్ర వరం కమిషనర్ అభిషక్త కిషోర్, అమలాపురం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్లు హిమాన్షు కౌశిక్, అనుపమ అంజలి లు పాల్గొన్నారు.

# ఘనంగా సప్తఋషుల హోమం మరియు పూజలు

కాకినాడ : మహిళలలో అత్యంత పవిత్రంగాను మరియు ధర్మకార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఋషిపంచమి వ్రతం పేరిట జరిగే కార్యక్రమాన్ని స్థానిక జర్నలిస్టు కాలనీలో ఉన్న శ్రీరమాసహిత సత్యదేవ మరియు శ్రీ దాసాంజనేయ స్వామివారి ఆలయ ప్రాంగణంలో పూజలు హోమాలు శ్రీమతి తుంగమణి పరశురామ్‌లచే మాధ్వపురోహితులు భీమాచార్, యాతగిరి మధ్వేష్‌ల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ దంపతులను మధ్వసభ ఆచార్యులు శ్రీమతి జయమ్మ పరశురామ్ దంపతులు పూజా కార్యక్రమాలను దర్శించుకొని ఆశీర్వదించారు. జర్మలిస్టు పరశురామ్ మాట్లాడుతూ సప్తఋషులైన అత్రి, కశ్యప, భరద్వాజ, వశిష్ట, గౌతమ, అగస్త్య, జమదగ్ని మరియు మహాపతివ్రత అరుంధతిలను ఆరాధిస్తు నాలుగుఝాముల పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అదేవిధంగా ఈ సప్తఋషుల మంత్రాలను జపిస్తూ హోమాది కార్యక్రమాలనుకూడా ఘనంగా నిర్వహించామని అన్నారు. ఈ వ్రతం నిర్వాహణ ద్వారా మహిళలకు ఎంతో విశేషమైన భగవంతుని అనుగ్రహంతోపాటు ఇతర పూజాకార్యక్రమాల నిర్వహణకు మరింతగా చేసుకోవడానికి వీలుకలుగుతుందన్నారు. పురుషులకు షష్ఠిపూర్తి ఏవిధంగా ఆయుష్షును, ఆరోగ్యాన్ని వృద్ధి చేస్తుందో ఋషిపంచమీ వ్రతంద్వారా మహిళలకు సౌభాగ్యంతోపాటు వంశాభివృద్ధికూడా కలిగేందుకు భగవంతుని అనుగ్రహాన్ని పొందుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో మైలవరపు రఘుమశ్రీనివాస్ దంపతులు, శ్రీమతి కాళూరి పరిమళా రవీంద్ర దంపతులు, చిల్లరిగి హనుమంతాచార్, ఉదయగిరి శేషగిరిరావు, అనంతేశ్వరరావు, బారు గోవిందరావు, ఆరాద్రి రఘుతోపాటు రేగడమిల్లి కళ్యాణి కృష్ణమూర్తి దంపతులు పాల్గొని ఋషిపంచమీ వ్రతమండపాన్ని మరియు హోమ కార్యక్రమాలను దర్శించు కున్నారు. కార్య క్రమంలో శ్రీమతి మౌనిక, శ్రీరమామణి తోపాటు జూమ్‌లో పాలూరి అమూల్యా రుక్మిణి, కృష్ణ చైతన్య, పాలూరి శ్రీవిద్యా మోహనకృష్ణ దంపతులు,పాలూరి శ్రీనివాసమూర్తి, శ్రీమతి పాలూరి హేమా భీమ్‌సేన్‌రావు, పాలూరి జానకిరామ్ దంపతులు వ్రతమండపాన్ని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

# జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఈబి దాడులు

## - స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో అదనపు ఎస్పీ ఎన్.శ్రీదేవీరావు



విజయనగరం : స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో ఆధ్వర్యంలో జిల్లాలో గరివిడి, ఎల్విన్‌పేట, మక్కువ, కొమరాడ, సీతా నగరం, జామి, విజయనగరం 2 టౌన్ పోలీసు స్టేషన్ల పరిధిలలో దాడులు నిర్వహించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 02 ట్రాక్టర్లు, 01 జెసిబి, 1500 నాటుసారా పాకెట్లు, 90 లీటర్లు నాటుసారా, 19 క్వార్టరు బాటిలు మద్యం పట్టుకొన్నట్లుగా ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీరావు సోమవారం తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్పీ శ్రీమతి బి.రాజకుమారి ఆదేశాలతో ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్.శ్రీదేవీరావు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, ఎస్.ఈ .బిసిబ్బందితో దాడులు నిర్వహించినట్లుగా ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీరావు తెలిపారు. గరివిడి పి.ఎస్ పరిధిలో, వెదుళ్లవలస గ్రామం గెడ్డవద్ద అక్రమంగా ఇసుక లోడు చేస్తున్న ఒక జెసిబి, ఒక ట్రాక్టరును స్వాధీనం చేసుకొని, నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు.ఎల్విన్‌పేట పి.ఎస్ పరిధిలో, దోకులగూడ గ్రామం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టరును స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. మక్కువ పి.ఎస్ పరిధిలో 1,500 నాటుసారా పాకెట్లు, ఒక మోటారు సైకిలు స్వాధీనం చేసు కొని, ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసు కొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. కొమరాడ పి.ఎస్ పరిధిలో 50 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. సీతానగరం పి.ఎస్ పరిధిలో 40 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినారు. జామి పి.ఎస్ పరిధిలో, జామి జంక్షన్ దగ్గరలో 06 క్వార్టరు బాటిల్లు మద్యం ఎస్‌బి సిబ్బంది స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, తదుపరి చర్యల నిమిత్తం జామి పోలీసులకు అప్పగించినారు. విజయనగరం 2 టౌన్ పి.ఎస్ పరిధిలో 13 క్వార్టరు బాటిల్లు మద్యం ఎస్ఈబి సిబ్బంది స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని, తదుపరి చర్యల నిమిత్తం 2 టౌన్ పోలీసులకు అప్పగించినారు. ఈ దాడుల్లో ఎస్ఈబి అధికారులు, సిబ్బంది, స్నైపర్ టీం, మరియు స్థానిక పోలీసులు పాల్గన్నారని ఎస్ఈబి అదనపు ఎస్పీ కుమారి ఎన్. శ్రీదేవీరావు తెలిపారు.

# సిఐటియు ఆధ్వర్యంలో జీజీహెచ్ శానిటేషన్ వర్కర్స్ ఆందోళన



కాకినాడ : కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో జీజీహెచ్ శానిటేషన్ వర్కర్స్ 12వ రోజు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్మికురాలు వెంకట లక్ష్మీ మాట్లాడుతూ గత 20 సం॥లుగా జీజీహెచ్‌లో పారిశుద్ధ్య సేవలు నిర్వహిస్తున్నా తగిన గుర్తింపు లేదన్నారు.ప్రస్తుత జీతం 2018 ఫిబ్రవరిలో పెరిగిందని, రెండున్నర సం॥లు అయినా జీతాలు పెరగలేదన్నారు.ఇప్పుడు కోవిడ్ ఆసుపత్రిగా మారిందని, పనిభారం పెరిగిందన్నారు.అందరినీ మంచి ఆహారం తినమంటున్నారు. అందరికంటే ఎక్కువగా ఇన్ ఫెక్షన్ తమకే వస్తుందని చాలీచాలని వేతనాలతో మంచి బలవర్ధకమైన ఆహారం ఎలా తింటా మన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అడగకుండానే కొందరికి సహాయం చేస్తు న్నారని జీజీహెచ్ పారిశుద్ధ్య కార్మికులను పట్టించుకుని న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, యూనియన్ నాయకులు కళ్యాణ్, శేషు, రమేష్, వివిఎన్ కుమార్, కృష్ణవేణి, తలుపులమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైను సేఫ్టీ పరిజ్ఞానాన్ని పరీక్షించేందుకే ఆన్‌లైను క్విజ్ పోటీలు

- విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐపిఎస్



విజయనగరం : రాష్ట్ర పోలీసుశాఖ, సిఐడి విభాగం, సైబరు పీస్ ఫౌండేషను సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఈ రక్షాబంధన్ 4 ఎస్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రముఖ సైబరు నిపుణుల సహకారంతో 'ఆన్‌లైను సేఫ్టీ' అనే అంశంపై ఆన్‌లైను క్విజ్‌ను నిర్వహించినట్లుగా జిల్లా ఎస్పీ బి.రాజకుమారి తెలిపారు. ఈ క్విజ్ పోటీలో ఎంతో ఆసక్తితో, ఉత్సాహంగా మహిళలు, విద్యార్ధులకు, ఉపాధ్యాయులు మరియు ఇతర వర్గాల ప్రజలు పాల్గని, తమ పరిజ్ఞానాన్ని పరీక్షించుకున్నారు. ఈ క్విజ్ పోటీలో పాల్గనదల్చినవారు ముందుగా ఇచ్చిన లింకులో ఈామెయిల్ అడ్రసు, పేరును నమోదు చేసుకొని క్విజ్ పోటీలో పాల్గన్నారు. ఆన్‌లైను సేఫ్టీ అనే అంశంపై ఆన్‌లైనులో ఇచ్చిన 20 ప్రశ్నలకు సమాధానం చెప్పి, తమ సైబరు పరిజ్ఞానాన్ని పరీక్షించుకున్నారు. ఈ పోటీలో పాల్గొన్న వారందరికి సర్టిఫికేట్లును సిఐడి విభాగం పంపించనున్నట్లుగా విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజ కుమారి తెలిపారు.

ఈ 'రక్షాబంధన్ 4ఎస్'కార్యక్రమంలో భాగంగా ఆగష్టు 26న ఉదయం 11 గం॥ల నుండి 'సైబరు క్రైమ్స్ శిక్షలు' అనే అంశం మీద వెబినార్‌ను సైబరు నిపుణులు నిర్వహించనున్నట్లు, యూ ట్యూబ్ లైవ్ వీడియోను వీక్షించవచ్చునని విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి తెలిపారు.

# పోలియో ఫండ్‌కి పబ్బినీడి విరాళం



రోటరీ ఫౌండేషన్‌కు విరాళం అందిస్తున్న పబ్బినీడి

కాకినాడ : రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ సతీష్ బాబు డిస్ట్రిక్ట్ పోలియో ఫండ్ చైర్మన్ దత్త పిలుపును అనుసరించి రోటరీ పోలియోఫండ్‌కి 10,000 రూ॥ విరాళాన్ని రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సభ్యులు పబ్బినీడి వెంకటకృష్ణ అందజేసారు. క్లబ్ అధ్యక్షులు చోడిశెట్టి పద్దరాజు, కార్యదర్శి కె.వి.టి. నారాయణరావు (నానీ), కోశాధికారి సత్తి రవిరెడ్డిలకు, పబ్బినీడి స్వగృహంలో ఈ మొత్తం తాలూకు నగదును అందజేసారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పద్ద రాజు మాట్లాడుతూ పోలియోనిర్మూలన కార్యక్రమంద్వారా ప్రపంచవ్యాప్తంగా పిల్లలు ఆరోగ్యంగా జీవించాలన్న ప్రధాన ఆశయంతో 5సం॥ల పిల్లలవరకు పోలియో వ్యాక్సిన్‌ను ఉచితంగా వేయాలన్న సంకల్పాన్ని ధృడంగా అంతర్జాతీయ రోటరీ చేపట్టిందని గుర్తు చేశారు. ఇప్పటికే గత మూడు శతా బ్దాలుగా పోలియో రహిత ప్రపంచాన్ని ఆవిష్కరించాలన్న రోటరీ ప్రయత్నం సత్ ఫలితాలను ఇవ్వడం వల్ల రెండు దేశాలు మినహా అన్ని దేశాలు పోలియోరహితంగా ప్రకటించబడడం ఇందుకు నిదర్శన మన్నారు. అయితే పోలియో మహ్మారి రెండు దేశాలలో ఉండడంవల్ల తిరిగి వ్యాప్తి చెంద కుండా వుండేందుకు ముందు జాగ్రత్త చర్యగా పోలియో వ్యాక్సిన్‌ను చిన్న పిల్లలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రోటరీ ఉచితంగా వేస్తోందని వివరించారు. దేశవ్యాప్తంగా ఇమ్యునైజేషన్‌డే పేరిట ఏటా రెండుసార్లు నిర్వహించే ఈ కార్యక్రమంతో పాటు అప్పుడే జన్మించిన నవజాత శిశువులకు కూడా పోలియో వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని సమర్ధ వంతంగా నిర్వహిస్తోందని ఆయన వివరించారు. ఈ పోలియో ఫండ్‌కు సభ్యులు మరియు వారి మిత్రులు అందించే విరాళాలకు రెండింతలు విరాళాన్ని బిల్‌గేట్స్ ఫండేషన్ జతచేసి అంతర్జాతీయ రోటరీ ఫౌండేషన్‌కు అందించ డంవల్ల ప్రపంచ వ్యాప్తంగా పోలియోరహిత శిశువులను సమాజానికి అందించేందకు ఎంతో కృషిజరుగుతోందని పద్దరాజు వివరించారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ సభ్యులు రోటరీ ఫౌండేషన్‌కు తమవంతు విరాళాలను త్వరలో అందజేస్తారని అన్నారు.

# తేమ ఎక్కువగా ఉంటే కరోనా వైరస్ దరిచేరదు..



న్యూఢిల్లీ : కరోనా వైరస్ వేగంగా విజృంభిస్తోంది. ఇప్పటివరకు ఎలాంటి మందులు అందుబాటులో లేవు. అసలు కరోనా ఎలా వ్యాపిస్తుందో కూడా చెప్పలేని పరిస్థితి ఉన్నది. కరోనా ఏయే మార్గాల్లో వ్యాపిస్తుందో గుర్తించలేకపోతున్నారు. కరోనా వైరస్ వ్యాప్తిని నియంత్రించడానికి ప్రస్తుతానికి మన వద్ద ఉన్న ఆయుధాలు.. సామాజిక దూరం.. ఫేస్ మాస్క్.. ఈ రెండు ఆయుధాల ద్వారానే దాదాపు కరోనా వ్యాప్తిని నియంత్రించేందుకు కష్టపడుతున్నాం. అయితే, గాలిలో కూడా కరోనా వైరస్ వ్యాపిస్తుందని పలు అధ్యయనాలు వెల్లడించాయి. గాలిలో తేమ తక్కువగా ఉన్న ప్రదేశాల్లో కరోనా వ్యాప్తి అధికంగా ఉంటుందని కనుగొన్నారు. గాలిలో తేమను కంట్రోల్ చేసినప్పుడే కరోనా వ్యాప్తిని నియంత్రించగలమని భారత్, జర్మనీ సైంటిస్టులు సూచిస్తున్నారు. దవాఖానలు, కార్యాలయాలు, బస్సులు, రైళ్లు.. వంటి వ్యవస్థల్లో గాలిలోని తేమ శాతాన్ని 40 నుంచి 60 శాతానికి నియంత్రించడం ద్వారా వైరస్ వ్యాప్తిని కట్టడి చేయగలమని వీరి అధ్యయనంలో తేలింది. సీఎస్ఐఆర్ కు చెందిన నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీ, జర్మనీలోని లిబ్నిజ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రోపోస్ఫియర్ రీసెర్చ్‌లు అధ్యయనాన్ని నిర్వహించాయి. గాలిలోని తేమశాతం 5 మైక్రోమీటర్ల కంటే తక్కువ సైజు ఉన్న నోటి తుంపర్లలోని సూక్ష్మజీవులపై ప్రభావం చూపుతుందని వీరు గుర్తించారు. అంతేకాకుండా, ఉపరితలాలపై వైరస్ ఎక్కువ సమయం ఉంటుందని వీరి అధ్యయనంలో తేలింది. గాలిలోని తేమ 40 శాతం కంటే తక్కువ ఉంటే కరోనా సోకే అవకాశాలు ఎక్కువని పేర్కొన్నది. కొవిడ్ బారిన పడ్డ వారి నోటి తుంపర్లలోని కణాలు తక్కువ నీటి కణాలను ఆకర్షిస్తాయని, ఫలితంగా వైరస్ కణాలు తేలికగా ఉండి ఎక్కువ దూరం ప్రయాణిస్తాయని అంటున్నారు. ఇతరులకు సోకే అవకాశం కూడా ఎక్కువ అవుతుందని లిబ్నిజ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రోపోస్ఫియర్ రీసెర్చ్ శాస్త్రవేత్త అజిత్ వివరించారు. గాలిలో తేమ తక్కువగా ఉంటే ముక్కు లోపలి పొరలు కూడా పొడిగా మారతాయని, ఫలితంగా వైరస్ ఎక్కువగా వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉంటే నోటి తుంపర్లు వేగంగా బరువెక్కి నేలపై రాలిపోతాయని చెప్తున్నారు. సాధ్యమైనంతవరకు గాలిలో తేమ ఉండేలా చూడాలని, అప్పుడే కరోనా వ్యాప్తిని కట్టడి చేయడం సాధ్యపడుతుందని పరిశోధకులు సూచిస్తున్నారు.

# నాన్న నన్ను గుర్తు పట్టారు.. : ఎస్పీ చరణ్



గత కొద్ది రోజులుగా కరోనాతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆరోగ్యం ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నట్టు కనిపిస్తుంది. తాజాగా బాలుని ఆయన తనయుడు చరణ్ వార్డ్‌లోకి వెళ్లి కలిసారు. నాన్న నన్ను గుర్తు పట్టారు. అందరు ఎలా ఉన్నారని సంజ్ఞలు కూడా చేశారని వీడియో ద్వారా చెప్పుకొచ్చాడు చరణ్. చరణ్ వీడియోలో మాట్లాడుతూ.. దాదాపు రెండు వారాల తర్వాత నాన్నని కలిసా. నన్ను గుర్తుపట్టి, కొద్ది సేపు మాట్లాడారు. ఆయన గురించి అందరు చేస్తున్న ప్రార్ధనల గురించి చెప్పాను.. త్వరగా కోలుకోవాలని అందరు ప్రార్ధిస్తున్నారని చెప్పుకొచ్చాను. దానికి ఆయన థంబ్సప్ సింబల్ చూపించారు. అమ్మ, నువ్వు ఎలా ఉన్నారని సైగలతో అడిగారు. ఆయన గదిలో ఏర్పాటు చేసిన సంగీతానికి కూడా స్పందిస్తున్నారు. నాన్న చూసి సంతోషించా. ఇక తరచు వెళ్ళి కలుస్తుంటా. నాన్న త్వరగా కోలుకోవాలని ప్రార్ధించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. త్వరలో మనందరిని కలుస్తారు. నాన్నని కంటికి రెప్పలా చూసుకుంటున్న ఎంజీఎం ఆసుపత్రి బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు అని పేర్కొన్నారు.

# ఇమ్యూనిటీ పెంచే ఐదు రత్నాలు



ఇది రోగాల కాలం. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వ్యాధులను కలుగజేయడానికి పొంచి ఉంటాయి సూక్ష్మజీవులు. ఒకవైపు నిలిచిపోయిన వర్షపునీటి ద్వారా వ్యాపించే దోమలు, మరోవైపు కలుషిత నీటి ద్వారా వ్యాపించే బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు.. వెరసి ఇదొక సంధికాలం. రుతువు మారినప్పుడల్లా వాతావరణంలో వచ్చే మార్పులు అనేక రకాల వ్యాధికారక క్రిములు పెరగడానికి దోహదపడుతాయి. ఇలాంటి వాతావరణానికి ఇప్పుడు కొవిడ్ 19 తోడయింది. దీన్ని ఎదుర్కోవాలంటే మనల్ని మనం బలంగా తయారుచేసుకోవడం అవసరం. మనలోని రోగనిరోధక శక్తిని మెరుగుపరుచుకోవాల్సిన తరుణమిది.

మొన్నటి వరకు కడుపులోకి ఏం పదార్థాలు, ఎలా తింటున్నామో పట్టించుకునే టైం లేదు. కంటి నిండా నిద్రపోవాలన్న ధ్యాస లేదు. ఉరుకులు పరుగుల ఒత్తిడితో సతమతం అయిపోయాం. ఎంతసేపూ పోటీలో గెలవాలి.. డబ్బు సంపాదించాలి.. స్టేటస్ పెంచుకోవాలి... ఇవే మన టార్గెట్లు. కానీ విజయానికి అసలైన చిరునామా అయిన ఆరోగ్యం గురించి ఆలోచించేందుకు కూడా మనం ప్రయత్నించలేదు. ఇప్పుడు వర్షాకాలపు రోగాలకు తోడు విజృంభిస్తున్న మహమ్మారి మన రోగ నిరోధక శక్తిని సవాలు చేస్తున్నది. అందుకే ఇప్పుడు అందరి దృష్టి ఇమ్యూనిటీ మీదకు మళ్లింది. డబ్బు సంపాదన కన్నా ఆరోగ్య భాగ్యం ముఖ్యమని ఇప్పుడు అర్థం అవుతున్నది. జీవనశైలిని ఆరోగ్యం వైపు నడిపించాలన్న స్పృహ వచ్చింది. అందుకే ఇమ్యూనిటీని పెంచుకోవడానికి రకరకాల మార్గాలను వెతుకుతున్నారు. ఇప్పటివరకూ మన ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేసింది చాలు. ఇప్పుడైనా ఆరోగ్యాన్ని పెంచే జీవనశైలి పైన దృష్టి పెడదాం. ఇందుకోసం నిపుణులు సూచిస్తున్న అయిదు మార్గదర్శకాలివే..

**నిద్రే ఔషధం**

పని ఒత్తిడితోనో, ఉద్యోగంలో ఉన్నతి కోసమో.. లేక పార్టీలు, పబ్‌లంటూనో.. ఇలా కారణం ఏదైనా నిద్ర లేని రాత్రులెన్నో గడిపాం. మన ఇమ్యూనిటీ బలహీనపడటానికి ప్రధాన కారణాల్లో ఒకటి నిద్ర లేకపోవడం. 164 మంది ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులపై ఇటీవల చేసిన అధ్యయనం దీన్ని బలపరుస్తున్నది. వీళ్లలో రాత్రి పూట 6 గంటల కన్నా తక్కువ సమయం నిద్రపోయిన వాళ్లపై సులువుగా జలుబు, ఫ్లూ లాంటివి దాడి చేశాయని దీనిలో తేలింది. నిద్రకీ, మన వ్యాధి నిరోధక వ్యవస్థకీ చాలా దగ్గరి సంబంధం ఉంది. మనం నిద్ర పోయినప్పుడు శరీరంలోని జీవక్రియలన్నీ విశ్రాంతి స్థితికి వస్తాయి. నిద్ర సమయంలో బేసల్ మెటబాలిక్ రేటు తగ్గుతుంది. ఈ సమయంలో శరీరంలో చిన్న చిన్న మరమ్మత్తులు జరుగుతాయి. ఈ రిపేర్ మెకానిజమ్ బాగా జరిగితే మరుసటి రోజు శరీరం మరింత చురుగ్గా పనిచేయగలుగుతుంది. వ్యాధి నిరోధక వ్యవస్థ బలోపేతం కావడానికి కూడా ఇది దోహదం చేస్తుంది. తగినంత నిద్ర పోవడం వల్ల ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గుతుంది. మనలోని సహజసిద్ధమైన వ్యాధి నిరోధక శక్తి నిద్ర ద్వారా చైతన్యవంతం అవుతుంది.

**ఎవరికి.. ఎంత నిద్ర?**

చిన్న పిల్లలు, చంటి పిల్లలకు 14 గంటల వరకు నిద్ర అవసరం. టీనేజిలో ఉన్నవాళ్లు 8 నుంచి 10 గంటలు పడుకోవాలి. అంతకన్నా పెద్దవాళ్లకు కనీసం 7 గంటల పాటు మంచి నిద్ర ఉండాలి.

**మంచి నిద్ర కోసం..**

సుఖనిద్ర ఉండాలంటే రాత్రిపూట గాడ్జెట్స్ వాడకాన్ని తగ్గించాలి. పొగతాగడం, ఆల్కహాల్ తీసుకోవద్దు. కాఫీ, టీలు కూడా సాయంత్రం 6 తర్వాత తాగొద్దు. పడుకోవడానికి పది నిమిషాల ముందు గోరువెచ్చని పాలు తాగండి. రాత్రిపూట ఫోన్ చూడకుండా పుస్తకం చదువుకోవడం మేలు. ఫోన్, టీవీ, కంప్యూటర్లు మన నిద్ర సైకిల్‌ని డిస్టర్బ్ చేస్తాయి. రోజూ వ్యాయామం చేయడం కూడా నిద్ర బాగా పట్టడానికి ఉపకరిస్తుంది.

**ఆహారం కీలకం**

ఇన్‌ఫెక్షన్లను తట్టుకోవడానికి మాత్రమే కాదు.. శరీరం బలంగా ఎదగాలన్నా, మెదడు చురుగ్గా పనిచేయాలన్నా మనం తీసుకునే ఆహారమే కీలకమైనది. అందుకే ఎంత తింటున్నాం అనే దాని కన్నా ఎంత నాణ్యమైన ఆహారం, ఎంత పోషకయుతంగా తింటున్నామన్నది కీలకం. కేలరీలు ఎక్కువగా ఉండే ఆహారం కాకుండా ప్రొటీన్లు ఎక్కువగా తీసుకోవాలి.

**ఇవి తినండి**

పండ్లు, కూరగాయలు, గింజలు, విత్తనాలు, చిక్కుళ్లలో యాంటి ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌ను తగ్గించడంలో యాంటి ఆక్సిడెంట్లు ప్రధానమైనవి. శాకాహారాన్ని ఎక్కువగా తీసుకోవడం మంచిది. జీర్ణ వ్యవస్థలో ఉండే సూక్ష్మజీవుల అభివృద్ధికి ఇది సహాయపడుతుంది. తద్వారా జీర్ణ వ్యవస్థ సక్రమంగా ఉండి, ఇమ్యూనిటీ పెరుగుతుంది. జింక్, ఇనుము, సెలీనియం, క్రోమియం లాంటి సూక్ష్మ పోషకాలు ఎక్కువ ఉండేలా చూసుకోవాలి. విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ బి6, విటమిన్ ఇ లాంటి యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి.

**ఇవి తినవద్దు**

కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. ఈ వర్షాకాలంలో రోడ్డు మీద అమ్మే ఫాస్ట్ ఫుడ్స్ తినడానికి మక్కువ చూపుతుంటారు. కానీ ఈ సీజన్‌లో (వర్షం కొవిడ్) ఇలాంటి ఆహారం జోలికి పోవద్దు. ఇంట్లో కూడా వేపుడు కూరలు వాడకండి. ఫ్రిజ్‌లో నిలవ చేసి తినవద్దు. వేడి వేడి ఆహారం మాత్రమే తీసుకోవాలి. చల్లని పానీయాలకు దూరంగా ఉండండి.

**వ్యాయామం మానవద్దు**

ఆహారం తర్వాత మన ఆరోగ్యాన్ని చల్లగా ఉంచేది శారీరక శ్రమ. వర్క్ ఫ్రం హోమ్ ఉండటంతో ఇంట్లోనే కడుపులో చల్ల కదలకుండా కూర్చునేందుకు ఆస్కారం ఉంది. కాని తగినంత శారీరక శ్రమ లేకపోతే ఇమ్యూనిటీ దెబ్బతింటుంది. ప్రతిరోజూ చేసే వ్యాయామం వల్ల రక్తప్రసరణ బాగా జరిగి, కణ కణానికీ ఆక్సిజన్ చక్కగా అందుతుంది. ఇది వ్యాధి నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. కాబట్టి వారానికి అయిదు రోజులు కనీసం 45 నిమిషాలైనా ఏదో ఒక వ్యాయామం చేయండి.

**ఎలాంటివి చేయాలి?**

ఇప్పుడు జిమ్‌లు కూడా ప్రారంభం అయ్యాయి. కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకుంటూ జిమ్‌కు వెళ్లవచ్చు. రిస్క్ ఎందుకులే అనుకుంటే ఇంట్లోనే చేయదగిన వ్యాయామాలు ఎన్నో ఉన్నాయి. కార్డియాక్ వ్యాయామాలు, బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు, యోగాసనాలు, సూర్యనమస్కారాల వంటివి ఏవైనా చేయవచ్చు. పొద్దున్నే లేచి మీ కాలనీలోనే గంట పాటు వాకింగ్ చేయవచ్చు. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు వచ్చే సీజన్ కాబట్టి వాటికి బలాన్నిచ్చే వ్యాయామాలపై దృష్టి పెట్టండి. ప్రాణాయామం, ఇతర బ్రీతింగ్ వ్యాయామాలు తప్పనిసరిగా చేయండి.

**ఎప్పుడు చేయాలి?**

వ్యాయామం ఎప్పుడు పడితే అప్పుడు చేయవద్దు. పొద్దున్నే చేయడం మంచిది. కనీసం సాయంకాలం పూట చేయవచ్చు. అంతేగానీ రాత్రిపూట వ్యాయామం చేయవద్దు. దీనివల్ల నిద్ర దెబ్బతింటుంది. అలవాట్లతో తంటా ఆరోగ్యకరమైన అలవాట్లు ఇమ్యూనిటీని పెంచితే దురలవాట్లు వ్యాధి నిరోధక వ్యవస్థ పనితీరును దెబ్బతీస్తాయి. పొగతాగడం వల్ల ఊపిరితిత్తులపై ప్రభావం నేరుగా ఉంటుంది. ఈ చల్లని వాతావరణంలో ఫ్లూ, న్యుమోనియా లాంటి ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువ. పొగతాగే అలవాటున్నవాళ్ల ఊపిరితిత్తులు బలహీనంగా ఉంటాయి. కాబట్టి సులువుగా కరోనా లాంటి ఇన్ఫెక్షన్ బారిన పడే ప్రమాదం ఉంటుంది. దీనివల్ల ఊపిరితిత్తుల్లోని సున్నితమైన పొరలు దెబ్బతింటాయి. రోగనిరోధక వ్యవస్థ కుంటుపడి యాంటీబాడీల ఉత్పత్తి తగ్గుతుంది. చిన్న చిన్న రక్తనాళాలు దెబ్బతింటాయి. రక్తప్రసరణ దెబ్బతినడం వల్ల యాంటీబాడీల చర్యలు ప్రభావవంతంగా ఉండవు. ఆల్కహాల్ ఎక్కువగా తీసుకునేవాళ్లలో కూడా రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. మద్యం వల్ల కాలేయం దెబ్బతినడంతో యాంటీబాడీలకు సంబంధించిన ప్రొటీన్లు సరిగా తయారుకావు. దాంతో ఆల్కహాలిక్స్ సులువుగా ఇన్‌ఫెక్షన్ల బారిన పడుతారు. వీళ్లలో పోషకాహార లేమి కూడా ఏర్పడుతుంది. దాంతో ఇమ్యూనిటీకి అవసరమైన పోషకాలు అందవు.

**ఇలా మానండి** :దురలవాట్లను మానడానికి ప్రధానంగా కావాల్సింది మానేయాలన్న సంకల్పం. కొవిడ్ లాంటి మహమ్మారి బారిన పడి, అవస్థలు పడేకన్నా వీటిని మానేయడం సులువన్న దిశగా ఆలోచించండి. పొగతాగాలనిపించినా, ఆల్కహాల్ తీసుకోవాలని అనిపించినా వెంటనే గ్లాసు మంచినీళ్లు తాగండి. లేదా పండ్లరసం తీసుకోండి. అలా వాటి నుంచి దృష్టి మరల్చే ప్రయత్నం చేయండి. అవసరమైతే నిపుణుల సహాయం తీసుకోండి.

**ఒత్తిడి.. ప్రథమ శత్రువు**

అధిక ఒత్తిడి మన జీవనశైలిలో భాగమైపోయింది. కరోనా వస్తుందేమోననే భయాందోళనలు దానికి తోడయ్యాయి. వ్యాధి కన్నా అది వస్తే ఎలా అనే ఆందోళనే ప్రాణాంతక పరిస్థితులు ఏర్పడటానికి కారణమని చెప్తున్నారు నిపుణులు. ఒత్తిడి, ఆందోళన వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గడమే ఇందుకు కారణం. ఒత్తిడి వల్ల స్ట్రెస్ హార్మోన్లు విడుదలవుతాయి. వీటి ప్రభావం ఇమ్యూన్ సిస్టమ్ మీద డైరెక్ట్‌గా పడుతుంది. శరీరంలోని ప్రతి జీవక్రియనీ ఒత్తిడి బలహీనపరుస్తుంది. అదేవిధంగా వ్యాధినిరోధక చర్యలు కూడా బలహీనపడుతాయి. వ్యాధి నిరోధక శక్తి తగ్గడానికే కాదు, అనేక రకాల జీవనశైలి వ్యాధులకు ప్రధాన కారణం ఒత్తిడే. మధుమేహం, గుండెపోటు, అధిక రక్తపోటు వంటి రిస్క్ పెరుగుతుంది. ఇలా జీవనశైలి వ్యాధులు కంట్రోల్ తప్పడం ఒకవైపు, సహజంగా వ్యాధి నిరోధక శక్తి తగ్గడం మరొకవైపు.. వెరసి ఇన్‌ఫెక్షన్లను ప్రాణాంతకం చేస్తాయి.

**ఎలా తగ్గించుకోవాలి?:** సానుకూల దృక్పథాన్ని ఏర్పరుచుకోవడం ఒత్తిడిని జయించే ప్రథమ సూత్రం. ఎదురయ్యే పరిస్థితి ఏదైనా దాన్ని అంగీకరించడం అవసరం. మన కర్మ సిద్ధాంతం చెప్పేదీ ఇదే. మరో ముఖ్యమైన విషయం వర్తమానంలో జీవించడం. నాకేమైపోతుందో.. అన్న భయం వదిలి వర్తమానంలో ఉన్న స్థితి గురించి మాత్రమే ఆలోచించాలి. ప్రతిరోజూ ధ్యానం చేయడం కూడా మనసులోని వ్యతిరేక ఆలోచనలను తగ్గించి మనసును ప్రశాంతంగా ఉంచుతుంది. మంచి సంగీతం వినడం, పుస్తకాలు చదవడం, కొత్త విషయాలను నేర్చుకోవడం, ఆత్మీయులతో అభిమానాలను పంచుకోవడం.. ఇవన్నీ ఒత్తిడిని జయించే మార్గాలే.

**నెగటివ్ ఆలోచనలు వద్దు**

మన ఆలోచనలో సానుకూలత ఉంటే ఏ పరిస్థితులూ మనల్ని ఏమీ చేయలేవు. తీవ్రమైన ఒత్తిడి, నెగటివ్ ఆలోచనల వల్ల స్ట్రెస్ హార్మోన్లు విడుదలవుతాయి. వీటి ప్రభావం వ్యాధినిరోధక వ్యవస్థ పైన ఉంటుంది. కాని సానుకూల ఆలోచనలు మాత్రం మెదడులోని రసాయనాలను సమతుల్యం చేసి, ఇమ్యూనిటీ పెంచుతాయి. తగినంత నిద్ర, సరైన విధంగా లేకపోతే మానసిక ఒత్తిడిగా బయటపడుతుంది. ఇది కాస్తా స్ట్రెస్ హార్మోన్ల పెరుగుదలకు, తద్వారా మెదడులోని రసాయనాల సమతుల్యతను దెబ్బతీయడానికి దారితీస్తుంది. ఈ ప్రభావం ఇమ్యూన్ రెస్పాన్స్ మీద పడుతుంది. ఫలితంగా తొందరగా ఇన్‌ఫెక్షన్లకు లోనవుతారు. శారీరక వ్యాయామం వల్ల శ్వాస వేగం పెరుగుతుంది. దాంతో ఊపిరితిత్తుల పని సామర్థ్యం మెరుగుపడుతుంది. అందువల్ల రక్తసరఫరా పెరుగుతుంది. స్ట్రెస్ వల్ల ఒత్తిడి హార్మోన్లు పెరిగినట్టుగా వ్యాయామం వల్ల దానికి రివర్స్ హార్మోన్లు రిలీజ్ అవుతాయి. ఎండార్ఫిన్ల ఉత్పత్తి పెరుగుతుంది. శారీరక వ్యాయామం వల్ల శారీరక, మానసిక ఉత్తేజం వచ్చి ఇమ్యూనిటీ పెరుగుతుంది.

**సొంతవైద్యం వద్దు** : ఆయుర్వేదంలో ఇమ్యూనిటీని ఓజస్సు అంటారు. దీన్ని అభివృద్ధి చేసుకోవడానికి చరకుడు పలు అంశాలను సూచించాడు. వ్యతిరేక భావోద్వేగాలు తగ్గించుకోవడం, ధ్యానంచేయడం, ఎక్కువ ఉడికించని ప్రాణమున్న ఆహారం, సులువుగా జీర్ణమయ్యేది తినడం, లైంగిక క్రియలో తక్కువగా పాల్గొనడం ద్వారా ఓజస్సు పెరుగుతుంది. యోగాసనాలు, ముద్రలు, మర్మథెరపీ లాంటివి కూడా ఇమ్యూనిటీ పెంచుతాయి. అశ్వగంధ, బ్రాహ్మి, గుడూచి, హరీతకి, లికోరస్, పిప్పలి, శంఖపుష్పి, శతావరి లాంటి రసాయనాలు కూడా రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అయితే వీటిని డాక్టర్ సూచనల మేరకే తీసుకోవాలి.

**సప్లిమెంట్లతో ఇమ్యూనిటీ పెరుగుతుందా?**

కొవిడ్ 19 నేపథ్యంలో విటమిన్లు, మినరల్స్‌కి సంబంధించిన సప్లిమెంట్ల గురించి ప్రచారం జరుగుతున్నది. సాధారణంగా ఆరోగ్యంగా ఉన్నవాళ్లు ఈ సప్లిమెంట్లను తీసుకోవాల్సిన అవసరం ఉండదు. మామూలు రోజుల్లో అయితే పోషకాహార లోపం ఉన్నవాళ్లకు గానీ, ఇతరత్రా జబ్బుల వల్ల వీటి లోపం ఏర్పడినప్పుడు ఈ సప్లిమెంట్లను సూచిస్తుంటాం. అయితే ఎన్నో రకాల రసాయనాలు కలిసిన ఆహారాన్ని ఇప్పుడు మనం తీసుకుంటున్నాం. కాబట్టి ఇమ్యూనిటీ తగినంత ఉండే అవకాశం చాలా తక్కువ. అందుకే ఈ విపత్కర పరిస్థితిలో సప్లిమెంట్లు తీసుకోవాలని చెప్తున్నాం. వీటిలో విటమిన్ సి, జింక్, బి కాంప్లెక్స్ లాంటి సప్లిమెంట్లు ఉంటాయి. వీటిని 12 ఏండ్లు దాటినవాళ్లు ఎవరైనా వేసుకోవచ్చు. చిన్నపిల్లలకు కూడా మల్టీవిటమిన్ సిరప్స్ ఇస్తున్నారు. అయితే వీటిని పీడియాట్రీషియన్ పర్యవేక్షణలో వాడితే మంచిది.

# కరోనా బాధితుల పట్ల మానవత్వం చూపాలి

## జీవోలో పేర్కొన్న దానికంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవు

## స్పందన కార్యక్రమంపై కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్



తాడేపల్లి: కోవిడ్ చికిత్సలకు అధిక రేట్లు వసూలు చేయడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కోవిడ్ ఆస్పత్రుల నిర్వహణపై కలెక్టర్లు దృష్టి పెట్టాలని సూచించారు. స్పందన కార్యక్రమంపై మంగళవారం సీఎం జగన్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన జీవోలో పేర్కొన్న దాని కంటే.. కోవిడ్ రోగుల వద్ద నుంచి ఎక్కువ వసూలు చేస్తే కచ్చితంగా చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి హెచ్చరించారు. కరోనా బాధితుల పట్ల మానవత్వం చూపించాలన్నారు. కోవిడ్ బాధితుడికి అరగంటలోగా బెడ్ ఇవ్వాల్సిన బాధ్యత కలెక్టర్లదే అని తెలిపారు. 104, 14410 కాల్ సెంటర్లకు వచ్చే ఫోన్ కాల్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వరదలు, సహాయక చర్యలపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. గోదావరి, కృష్ణా నదిలో వరదలు తగ్గుముఖం పడుతున్నాయన్నారు. సెప్టెంబర్ 7లోగా పంట నష్టంపై అంచనాలు రూపొందించాలని.. గోదావరి వరద ముంపు బాధితులకు 2 వేల రూపాయల అదనపు పరిహారం ఇచ్చేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దానితో పాటు రెగ్యులర్‌గా ఇచ్చే రేషన్‌కు అదనంగా 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ పామాయిల్, కేజీ ఉల్లి.. కేజీ బంగాళదుంపలు, 2 లీటర్ల కిరోసిన్ ఇవ్వాలన్నారు. సెప్టెంబర్ 7లోగా నిత్యావసరాలు అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ వసతులు దెబ్బతిన్న చోట వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

వరద ప్రాంతాల్లో రోగాలు రాకుండా మందులు అందుబాటులో ఉంచుకోవాలని.. వరద తగ్గుముఖం పట్టింది కాబట్టి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మండల స్థాయిలో నిత్యావసరాలను పూర్తిస్థాయిలో నిల్వ చేసుకోవాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి వసతుల క్లోరినేషన్ కోసం చర్యలు చేపట్టాలని సీఎం జగన్ కోరారు.

# ధోనీ, కోహ్లీ, రోహిత్ సహా 50 మంది క్రికెటర్లకు డోపింగ్ పరీక్షలు



ఢిల్లీ: రాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)-13వ సీజన్‌లో పాల్గొనే క్రికెటర్లకు డోపింగ్ పరీక్షలు నిర్వహించేందుకు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) సిద్ధమైంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి చెందిన జాతీయ డోపింగ్ నిరోధక కమిటీ (నాడో)తో కలిసి క్రికెటర్ల శాంపుల్స్ సేకరిస్తామని నాడా ఇప్పటికే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. యూఏఈలో సెప్టెంబర్ 19 నుంచి నవంబర్ 10 వరకు మ్యాచ్ వేదికల్లో ఆటగాళ్లకు పరీక్షలు నిర్వహించనున్నట్లు నాడా డైరెక్టర్ జనరల్ నవీన్ అగర్వాల్ పేర్కొన్నారు. యూఏఈలో నాడా ఐదు డోపింగ్ కంట్రోల్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. దుబాయ్, అబుదాబి, షార్జాలో ఒక్కో సెంటర్‌ను ఏర్పాటు చేయనుండగా శిక్షణా వేదికలు దుబాయ్‌లోని ఐసీసీ అకాడమీ, అబుదాబిలోని జాయేద్ క్రికెట్ స్టేడియంలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.

ఆటగాళ్ల మూత్రం శాంపిల్స్‌తో పాటు రక్త నమూనాలను కూడా నాడా సేకరించవచ్చు. ప్రముఖ భారత క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, మహేంద్రసింగ్ ధోనీ సహా స్టార్ క్రికెటర్లు 50 మంది నుంచి శాంపిళ్లను సేకరించనున్నారు. నాడాకు చెందిన మూడు బృందాలు వేర్వేరు బ్యాచ్‌ల్లో యూఏఈకి వెళ్లనున్నాయి. ఫస్ట్ బ్యాచ్ సెప్టెంబర్ మొదటి వారంలో బయలుదేరుతుంది. ఆ తర్వాత మిగతా బృందాలు వెళ్తాయి. యూఏఈ వెళ్లడానికి ముందే అందరికీ కరోనా నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు.

# బెంగళూరు చేరుకున్న సీఎం వైఎస్ జగన్

## పెద్ద కుమార్తె హర్షారెడ్డిని పారిస్ పంపేందుకు...



బెంగళూరు : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరుకు చేరుకున్నారు. సీఎం పెద్ద కుమార్తె హర్షారెడ్డికి ప్రపంచ ప్రఖ్యాత ఇన్సీడ్ బిజినెస్ స్కూలులో సీటు దక్కించుకున్న విషయం తెలిసిందే. తన కుమార్తెను పారిస్‌కు పంపేందుకు వైఎస్ జగన్ బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చారు. సీఎం జగన్ రాకతో బెంగళూరు విమానశ్రయం వద్ద ఆయన అభిమానులు పెద్ద ఎత్తున సందడి చేశారు. కాగా ప్రపంచంలోని టాప్ 5 బిజినెస్ స్కూల్స్‌లో ఇన్సీడ్ ఒకటి. అక్కడ హర్షారెడ్డి మాస్టర్స్ చేయనున్నారు. హర్షారెడ్డి చిన్నప్పటి నుంచి రాసిన ప్రతి పరీక్షలోనూ డిస్టింక్షన్ సాధించారు. ఇప్పటికే లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆ తర్వాత అమెరికాకు చెందిన బహుళ జాతి సంస్థ(ఎంఎన్‌సీ)లో ఫైనాన్షియల్ కన్సల్టెంట్‌గా ఉద్యోగం వచ్చినా.. దానిని వదులుకుని ఇన్సీడ్ బిజినెస్ స్కూల్‌లో మాస్టర్స్ చేయడానికి మొగ్గుచూపారు.

# జిల్లాలో చురుకుగా ఓటర్ల నమోదు

## జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్




విశాఖపట్నం : జిల్లాలో ఓటర్ల నమోదు కార్యక్రమం చురుకుగా సాగుతున్నదని జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ తెలిపారు. మంగళవారం అమరావతి నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కె.విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో

కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి పెండింగ్లో ఉన్న అంశాలను పూర్తి చేశామన్నారు. ఖాళీగా ఉన్న సహాయ ఎలక్టోరల్ అధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేస్తామన్నారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కె.విజయానంద్ మాట్లాడుతూ జనవరి15 నాటికి ఓటర్ల జాబితాలు ప్రచురించడానికి చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపుల దరఖాస్తులను జనవరి5 నాటికి పరిష్కరించాలన్నారు.రాష్ట్రంలో గ్రామ,వార్డు సచివాలయ సిబ్బంది ని బూత్ స్థాయి అధికారులుగా నియమించాలన్నారు. నియోజకవర్గ ఇ.ఆర్.ఓ లు లేనిచోట సీనియర్ అధికారులను ఇ.ఆర్.ఓ లుగా నియమించాలన్నారు.రాష్ట్రంలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ కొరకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కు నమోదయ్యేందుకు సెప్టెంబర్28,29 తేదీలు, నవంబర్ 12,13 తేదీల్లో స్పెషల్ క్యాంపన్ డేస్ గా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. రాష్ట్రంలో యువతకు ఓటు హక్కు నమోదు పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టర్ ఎం వేణుగోపాల రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. ప్రసాద్, నియోజకవర్గాల ఈ ఆర్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.



# రాయ్‌గఢ్ ఘటనలో మరొకరి మృతి

## కొనసాగుతున్న సహాయక చర్యలు

ముంబయి: రాయ్‌గఢ్‌లో భవనం కూలిన ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. మరో 18 మంది ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా కాజల్‌పురా ప్రాంతం మహద్ పట్టణంలో సోమవారం సాయంత్రం ఓ ఐదంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. దాదాపు 75 మంది భవనం శిథిలాల కింద చిక్కుకుపోయారు. అప్పటి నుంచి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టి పలువురిని కాపాడాయి.

కూలిన పదేళ్లనాటి ఆ భవనంలో 45 ఫ్లాట్లు ఉన్నట్లు నివాసితులు తెలిపారు. 'సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు ఇద్దరు మృతిచెందారు. ఇంకో 18 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది' అని రాయ్‌గఢ్ జిల్లా కలెక్టర్ నిధి చౌదరి పేర్కొన్నారు. మహారాష్ట్ర మంత్రులు అదితి ఠాక్రే, ఏక్‌నాథ్ శిండే ఘటనా స్థలాన్ని సందర్శించారు.

# ఏపీ ప్రభుత్వ సలహాదారు రామచంద్రమూర్తి రాజీనామా



అమరావతి : ఏపీ ప్రభుత్వ ప్రజా విధానాల సలహాదారు రామచంద్రమూర్తి తన పదవికి రాజీనామా చేశారు..రాజీనామా లేఖను ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయకల్లంకు సమర్పించారు. వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేసినట్లు రామచంద్రమూర్తి వెల్లడించారు. రామచంద్రమూర్తి సీనియర్ జర్నలిస్ట్. ఆయన పలు పత్రికలకు ప్రధాన సంపాదకులుగా పని చేశారు..వైసీపీ అధికారంలోకి వచ్చాక రామచంద్రమూర్తిని ప్రజా విధానాల సలహాదారు పదవిలో నియమించింది. అయితే ఆయన రాజీనామా వెనక అసలు కారణాలు తెలియరాలేదు. రామచంద్ర మూర్తితో పాటు ప్రభుత్వంలో ఇప్పటికి 33 మంది సలహాదారులను నియమించారు. వీరిలో పది మందికి కేబినెట్ హోదా కూడా ఉంది.

# ప్రముఖ రచయిత సదానంద కన్నుమూత

పాకాల: ప్రముఖ గేయ, కథా రచయిత కలువకొలను సదానంద(81) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈరోజు చిత్తూరు జిల్లా పాకాలలో తుదిశ్వాస విడిచారు. 1939 ఫిబ్రవరి 22న పాకాలలో కలువకొలను కృష్ణయ్య, నాగమ్మ దంపతులకు ఆయన జన్మించారు. సుమారు 36 ఏళ్ల పాటు ఉపాధ్యాయునిగా సేవలందించి 1997లో పదవీ విరమణ చేశారు.

తన 18వ ఏటనే రచనా వ్యాసంగాన్ని ప్రారంభించిన సదానంద.. ఇప్పటి వరకు 200 పైగా కథలు, 100పైగా గేయాలు, 8 కథా సంపుటాలు, రెండు నవలలు రాశారు. ఆయన అందించిన కథతో 1980లో 'బంగారు బావ' చిత్రం విడుదలైంది. సదానంద రచించిన 'బంగారు నడిచిన బాట' నవలకు 1966లో కేంద్ర ప్రభుత్వంచే ఉత్తమ బాల సాహిత్య పురస్కారం దక్కింది. బాలసాహిత్య పురస్కారం అందుకున్న తొలి తెలుగు సాహిత్యకారుడు సదానందే.

ఆయన రచించిన 'నవ్వే పెదవులు ఏడ్చే కళ్లు' కథా సంపుటికి 1976లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. సదానంద మృతికి పలువురు ప్రముఖులు, రచయితలు, సాహితీవేత్తలు సంతాపం తెలిపారు.

# వ్యయాలకు ఇది పెద్ద షాక్ : ఆర్‌బీఐ




దిల్లీ: రాష్ట్రాల్లో స్థానికంగా విధించే లాక్‌డౌన్‌ల కారణంగా ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకోవడంలో జాప్యం జరిగే అవకాశం ఉందని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా గురువారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. కొవిడ్ నుంచి కోలుకున్నట్లు తేలితే ఉద్దీపనలు తొలగించవచ్చని వెల్లడించింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆర్థిక కార్యకలాపాలు తగ్గినట్లు తెలిపింది. మే, జూన్ నెలల్లో ఆర్థిక వ్యవస్థలో పెరుగుదల కనిపించిందని నివేదికలో వెల్లడించారు. జులై, ఆగస్టులో ఈ వృద్ధి తగ్గిపోయినట్లు నివేదిక గుర్తించింది. ముఖ్యంగా రాష్ట్రాల్లో మరో సారి విధించిన లాక్‌డౌన్ కారణంగానే ఈ పరిస్థితి తలెత్తింది. ఫలితంగా ఆర్థిక వ్యవస్థలో కుంగుబాటు కొనసాగుతోందని ఆర్‌బీఐ తెలిపింది.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై సమీక్షా సమావేశం



విశాఖపట్నం : విశాఖ నగరంలోని సర్క్యూట్ హౌస్ లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై సమీక్ష సమావేశ నిర్వహించారు.ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎమ్మెల్యేలు గొల్ల బాబురావు, అదీప్ రాజ్, పాల్గొన, ఉమ శంకర్, గణేష్, భాగ్యలక్ష్మి, కన్నబాబు, ముత్యాల నాయుడు అరకు ఎంపీ మాధవి పలువురు పాల్గొన్నారు. నియోజకవర్గాల వారిగా సమీక్ష నిర్వహించిన మంత్రి వర్యులు కోవిడ్-19 నివారణ, చికిత్స , ఆరోగ్య శ్రీ, ఇళ్ళ పట్టాల పంపిణీ, ఉపాధి హామీ పథకం అమలు, నాడు నేడు కార్యక్రమంలో పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన, జగనన్న విద్యా కానుక, వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో మహిళలకు శిక్షణ, జీవనోపాధి, వ్యవసాయ శాఖ లో ఈ-క్రాప్ డేటా ఎంట్రీ, రైతు భరోసా కేంద్రాల నిర్వహణ, పలు అంశాలపై పై సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను మరింతగా ప్రజల్లో అవగాహన కల్పించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. నియోజకవర్గ లోని కరోన నివారణలకై .. తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. సీజనల్ వ్యాధులు బారిన పడకుండా అన్ని చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అంతేకాకుండా గ్రామా స్థాయి నుంచి మౌళిక వసతులు , రోడ్లు, పారిశుధ్యం అన్ని అభివృద్ధి పనులపై చర్చించారు. నియోజకవర్గాల్లో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు కోవిడ్ నిబంధనలు మేరకు చేపట్టాలని చెప్పారు. సీఎం జగన్మోహన్ రెడ్డి దేశం లోని ఎక్కడ లేని విధంగా ఏర్పాటు చేసిన వాలింటర్స్ వ్యవస్థని నెలకొల్పటంతో ప్రజలకు ప్రభుత్వ అందిస్తున్న పథకాలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నేరుగా వాలింటర్స్ లబ్ధిదారులకు అందిస్తున్నారాని అన్నారు. గత ప్రభుత్వాలు ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురించేశాయని అనేక సార్లు కార్యాలయాల చుట్టూ తిరిగిన ప్రయోజన లేదన్నారు.

అందుకనే ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారన్నారు. వైఎస్సార్ చేయూత పథకం పలు పథకాల ద్వారా లక్షలాది మంది మహిళలను ఔత్సాహిక వ్యాపార వేత్తలుగా మార్చటమే కాకా ఇది వరకే ఆయా రంగాల్లో ఉన్న వారికి బలమైన తోడ్పాటు అందించి వారి సుస్థిర జీవనోపాధి అవకాశాలను మరింత మెరుగు పడేందుకు దోహద పడతాయన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం , చేయూత ఈ రెండు పథకాలు తో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. పాఠశాలలు ప్రారంభైయే నాటికి నాడు నేడు కు సంబంధించిన పనులను వేగవంత చేసేలా చూడాలన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమ మీ సీఎం జగన్మోహన్ రెడ్డి ద్యేయమని తెలిపారు.

# 14 నుంచి పార్లమెంట్ సమావేశాలు?

## పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ సూచన



దిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలు దాదాపు ఖరారయ్యాయి. వచ్చే నెలలో ఈ సమావేశాలు నిర్వహించే యోచనలో కేంద్రం ఉన్నట్టు తెలుస్తోంది. సెప్టెంబర్ 14 నుంచి అక్టోబర్ 1 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిర్వహించాలని పార్లమెంట్ వ్యవహారాల కేబినెట్ కమిటీ సూచించినట్టు సమాచారం. మొత్తం 18 రోజుల పాటు నిర్వహించనున్నారు. మరోవైపు, కరోనాతో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాల నిర్వహణ కోసం అధికారులు ఉభయసభల్లోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భౌతికదూరం నిబంధనలకనుగుణంగా సభ్యులకు సీట్లు కేటాయించనున్నారు. ఈసారి ఉభయ సభల్లోనూ ఛాంబర్లు, గ్యాలరీలు సభ్యులకే సీట్లు కేటాయించనున్నారు. రాజ్యసభలో 60 మంది సభ్యులు ఛాంబర్‌లోబీ మరో 51మంది గ్యాలరీల్లో, మిగతా 132 మంది సభ్యులు లోక్‌సభలో కూర్చొనేలా ఏర్పాట్లు చేయడం భారత పార్లమెంట్ చరిత్రలో 1952 తర్వాత ఇదే తొలిసారి. అలాగే, ఇదే తరహా సీటింగ్ ఏర్పాట్లను లోక్‌సభలోనూ చేస్తున్నారు. ఆయా ప్రదేశాల్లో భారీ తెరాలను ఏర్పాటు చేస్తున్నారు. రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా జులై 17న సమావేశమై పార్లమెంట్ సమావేశాల నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు. ఛాంబర్లు, గ్యాలరీలను సైతం సభ్యులు కూర్చొనేందుకు వీలుగా ఉపయోగించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు చివరికల్లా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను వెంకయ్యనాయుడు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com